# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

సంచిక : 76 | సంపుటి : 3 | తెలంగాణ ఆంధ్రప్రదేశ్ | ఆదివారం | 15-6-2025 | వెల : .రూ. 5.00



## విలేకరులు కావలెను

తెలంగాణ & ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు
- RC ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు

-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:- 9705770909 సంప్రదించండి.






## నీట్ యూజీ ఫలితాలు వచ్చేశాయ్

- 100 లోపు ర్యాంకులతో సత్తాచాటిన తెలుగు రాష్ట్రాల విద్యార్థులు


**న్యూఢిల్లీ,-జూన్ 14(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఎంబీబీఎస్, బీడీఎస్ వంటి వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాలకు గత నెల నిర్వహించిన నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్ట్ (నీట్-యూజీ) ఫలితాలు విడుదలయ్యాయి. ఈ ఫలితాలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ శనివారం విడుదల చేసింది.అంతకు ముందు ఫైనల్ కీని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్టీఏ) శనివారం ఉదయం విడుదల చేసింది. ఆ తర్వాత కొన్ని గంటలకే తుది ఫలితాలను ఎన్టీఏ రిలీజ్ చేసింది. అభ్యర్థులకు మెయిల్స్ ద్వారా స్కోర్ కార్డులు అందుతున్నట్లు తెలుస్తోంది. నీట్ యూజీ 2025 పరీక్ష రాసిన విద్యార్థులు -మిగతా 2 లో



## మావోయిస్టులకు ఎదురుదెబ్బ..

- మధ్యప్రదేశ్ ఎన్‌కౌంటర్‌లో నలుగురు హతం..!

**న్యూఢిల్లీ, -**
మధ్యప్రదేశ్‌లోని బాలాఘాట్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో శనివారం ఎన్‌కౌంటర్ జరిగింది. ఇందులో నలుగురు మావోయిస్టులు ప్రాణాలు కోల్పోయారు. ఇందులో ముగ్గురు మహిళా మావోలు ఉన్నారు. నక్సల్ ప్రభావిత బిత్లి పోలీస్ అవుట్‌పోస్ట్ ప్రాంతంలోని పచామా దాదర్ దట్టమైన అడవిలో శనివారం ఎన్‌కౌంటర్ చోటు చేసుకున్నది. -మిగతా 2 లో



### 42శాతం బీసీ రిజర్వేషన్లతోనే
## స్థానిక ఎన్నికలు

- సామాజిక తెలంగాణ కోసం విద్యార్థులు పోరాడాలి
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత


**హైదరాబాద్-జూన్ 14(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించకుండా స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్తే ఊరుకోబోమని రేవంత్ సర్కారును ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. తెలంగాణ జాగృతి స్టూడెంట్ ఫెడరేషన్‌లో పెద్ద సంఖ్యలో చేరారు. వారికి కండువా కప్పి తెలంగాణ జాగృతిలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సామాజిక తెలంగాణ సాధనకు విద్యార్థి లోకం కదిలిరావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ఉద్యమంలో -మిగతా 2 లో



తరలివచ్చిన తెలుగు తారా లోకం

### హైటెక్స్‌లో
## సినీ సందడి

### అట్టహాసంగా గద్దర్ అవార్డుల వేడుక



- ఉత్తమ హీరో అవార్డును పుష్పకు గాను హీరో అల్లు అర్జున్‌కు
- అల్లు అర్జున్,బాలకృష్ణలకు రేవంత్ అవార్డులు అందచేత

**హైదరాబాద్ -జూన్ 14(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
తెలంగాణ గద్దర్ అవార్డుల ప్రదానోత్సవం హైటెక్స్‌లో ఘనంగా మొదలైంది. దాదాపు దశాబ్దం తరవాత మళ్లీ సినిమా పండగ జరగడంతో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తం అయ్యాయి. సీఎం రేవంత్‌రెడ్డితోపాటు- పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు. -మిగతా 2 లో



## నేటీ నుంచి కెనడాలో జీ7 సదస్సు

- హాజరుకానున్న ప్రధాని మోదీ

**న్యూఢిల్లీ**
ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారం నాడు మూడు దేశాల పర్యటనకు వెళ్తున్నారు. ఈనెల 15-16 తేదీల్లో సైప్రస్ లో పర్యటిస్తారు. 16-17 తేదీల్లో కెనడాలోని జీ-7 సదస్సులో పాల్గొంటారు. 18న క్రొయేషియా లో పర్యటిస్తారు. కేంద్ర విదేశాంగ శాఖ శనివారంనాడు ఈ వివరాలను వెల్లడించింది. ఎంఈఏ వివరాల ప్రకారం, సైప్రస్ అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడౌలిడెస్ ఆహ్వానం మేరకు ప్రధానమంత్రి మోదీ ఈనెల 15-16 తేదీల్లో ఆ దేశంలో అధికారిక పర్యటన -మిగతా 2 లో

### జగన్‌తో ములాఖత్ అయి
## కృష్ణా జలాల దోపిడీ

### పదేళ్లలో దోచిపెట్టిన ఘనులు బీఆర్ఎస్ పాలకులు



- కృష్ణాజలాల వాటాను కేవలం 299 టిఎంసిలకే పరిమితం
- బనకచర్లపై మేము అప్రమత్తంగానే ఉన్నాం
- హరీష్ వ్యాఖ్యలపై మండిపడ్డ మంత్రి ఉత్తమ్

**హైదరాబాద్,-జూన్ 14(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
నదీ జలాల హక్కులపై తెలంగాణకు నష్టం చేసింది ఆర్ఎస్ పార్టీనే అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. కృష్ణానది వాటాను కేవలం 299 టిఎంసిలకే పరిమితం చేశారని.. బిఆర్ఎస్ హయాంలోనే ముచ్చుమర్రి, మాల్యాల నుంచి నీటిని తరలించారని అన్నారు. రాయలసీమ ఎత్తిపోతలపై అపెక్స్ కౌన్సిల్‌ను మీరెందుకు -మిగతా 2 లో



## బనకచర్ల దోపిడీని అడ్డుకోవడంలో విఫలం

- ముఖ్యమంత్రి, నీటిపారుదల మంత్రుల నిర్లక్ష్యం
- కేంద్రం చేయూతనిస్తుంటే ఎంపీలు ఏం చేస్తున్నారు
- నిలదీసిన మాజీమంత్రి హరీష్ రావు

**హైదరాబాద్, జూన్ 14(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
గోదావరి జలదోపిడీ జరుగుతుంటే ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లుగా ఉందని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. దీనిని తక్షణమే అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. కృష్ణా జలాలను అక్రమంగా తరలించడానికి పోతిరెడ్డిపాడు ఎలా -మిగతా 2 లో



## లక్కీ నంబరే కొంపముంచిందా?

- రెండుసార్లు టిక్కెట్ క్యాన్సిల్ చేసుకున్న రూపాని

**అహ్మదాబాద్ -జూన్ 14(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిరిండియా విమాన ప్రమాదంలో మరణించిన గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపాని ప్రయాణానికి సంబంధించి మరో విషయం వెలుగులోకి వచ్చింది. లండన్‌లో ఉన్న తన భార్య, కుమార్తెను కలిసేందుకు వెళ్తున్న రూపానీ -మిగతా 2 లో


### వరుసగా రెండో రోజు ఏఐజీ
## ఆస్పత్రికి కేసీఆర్

- జలుబు తదితర కారణాలతో వైద్య పరీక్షలు



**హైదరాబాద్, జూన్ 14(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ గచ్చిబౌలి ఏఐజీ ఆస్పత్రికి వైద్య పరీక్షల కోసం వెళ్లారు. గత కొంత కాలంగా జలుబుతో బాధపడుతున్న కెసిఆర్ ఆరోగ్య పరీక్షల కోసం శనివారం ఉదయం ఏఐజీ ఆస్పత్రికి వెళ్లారు. ఆయన వెంట కుటుంబసభ్యులు, మాజీ మంత్రి హరీష్ రావు, తదితరులు ఉన్నారు. శుక్రవారం కూడా ఆస్పత్రికి -మిగతా 2 లో

## తెలంగాణలో స్థానిక ఎన్నికల సందడి



- ప్రకటనలతో నేతల అలర్ట్
- గ్రామాల్లో ఊపందుకోనున్న రాజకీయ వేడి

**హైదరాబాద్,జూన్ 14(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
తెలంగాణలో స్థానిక సంస్థలకు త్వరలోనే ఎన్నికలంటూ మంత్రులు అడపాదడపా ప్రకటనలు చేస్తున్నారు. గెలిచేది తామేనని కూడా ప్రకటిస్తున్నారు. ఈ క్రమంలో జూన్, జూలై మధ్య ఎన్నికలకు అవకాశాలు మెండుగా ఉన్నాయి. సర్పంచ్, ఎంపిటిసి, జడ్‌పిటిసి ఎన్నికలను నిర్వహించేలా లోలోపల వేగంగా పావులు కదుపుతున్నాయని -మిగతా 2 లో

# 42శాతం బీసీ రిజర్వేషన్లతోనే స్థానిక ఎన్నికలు

(మొదటి పేజీ తరువాయి)

విద్యార్థులు ముందు వరుసలో ఉండి కొట్లాడారని.. తెలంగాణ ఉద్యమంలో విద్యార్థులు కీలక పాత్ర పోషించారన్నారు. అదే స్ఫూర్తితో సామాజిక తెలంగాణ సాధన ఉద్యమంలో విద్యార్థులు ముందు వరుసలో ఉండాలని.. సామాజిక తెలంగాణను సాధించడానికి విద్యార్థులు నడుం బిగించాలన్నారు. బీసీ బిల్లులు కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉండగానే.. స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలన్న ఆలోచన సరికాదన్నారు. బీసీలకు 42 రిజర్వేషన్లకు ఇవ్వకుండా ఎన్నికలు నిర్వహిస్తే చూస్తూ ఊరుకోబోమన్నారు. 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కర్నాటకలో కులగణన ఎలా చేయాలో అక్కడి సీఎం సిద్దరామయ్యకు నేర్పించానని సీఎం రేవంత్ రెడ్డి చెప్పుకుంటున్నారని.. సీఎం ఈ ప్రకటన చేసిన గంట సేపటికే కాంగ్రెస్ అధికారికంగా ఒక ఫొటో విడుదల చేసిందని.. ఆ ఫొటోలో రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, సిద్ధరామయ్య, డీకే శివకుమార్ ఉన్నారని.. రేవంత్ రెడ్డి మాత్రం లేరన్నారు. దీన్ని బట్టే రేవంత్ రెడ్డి ఎన్ని అబద్దాలు ఆడుతున్నారో అర్థమవుతుందన్నారు. రాహుల్ గాంధీ దర్శనం లేక సీఎం రేవంత్ రెడ్డి విలవిలలాడు తున్నారని.. దర్శనాల సంగతి పక్కనబెట్టి ప్రజా సమస్యలపై సీఎం దృష్టిపెట్టాలని సూచించారు. ఆర్ఎస్ఎస్ స్కూల్, టీడీపీ కాలేజీలో చదువుకున్నానని.. జాబ్ కాంగ్రెస్ లో చేస్తున్నానని సీఎం అన్నారని.. చేస్తున్న జాబ్‌లో కూడా రేవంత్ రెడ్డికి పాస్ మార్కులు రావడం లేదని ఎద్దేవా చేశారు. ఢిల్లీకి వెళ్లడంలో రేవంత్ రెడ్డి హాఫ్ సెంచరీ చేశారని.. కనీసం మంత్రివర్గాన్ని కూర్పు చేసుకోలేని సీఎం రేవంత్ రెడ్డి అని.. ఇంత అసమర్థ, బలహీన ముఖ్యమంత్రిని గతంలో ఎప్పుడూ చూడలేదని విమర్శించారు. ఉమ్మడి రాష్ట్రంలో చివరి ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి కూడా ఇంత బలహీనంగా లేకుండేనని.. తెలంగాణ ఆత్మగౌరవాన్ని రేవంత్ రెడ్డి ఢిల్లీలో తాకట్టు పెడుతున్నారని ఆరోపించారు. విద్యార్థుల సమస్యలు, విద్యారంగ పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని.. దాదాపు రూ.8వేల కోట్ల మేర ఫీజు రియింబర్స్ మెంట్ బకాయిలు ఉన్నాయని.. తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. విద్య భరోసా కార్డులు పంపిణీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని విస్మరిస్తోందని.. తెలంగాణ జాగృతి విద్యార్థి విభాగం మెరుపులా పనిచేయాలని సూచించారు.

# హైటెక్స్‌లో సినీ సందడి

(మొదటి పేజీ తరువాయి)

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎఫ్‌డీసీ ఛైర్మన్, నిర్మాత దిల్‌రాజు, ఎఫ్‌డీసీ ఎండీ హరీశ్ జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకను ప్రారంభించారు. సినీ ప్రముఖులు బాలకృష్ణ, అల్లు అర్జున్, విజయ్ దేవరకొండ, నాగ్ అశ్విన్, సుకుమార్, మణితర్నం, సుహాసిని తదితరులు సందడి చేశారు. పలువురు విజేతలకు భట్టి విక్రమార్క, కోమటిరెడ్డి అవార్డులు అందజేశారు. ఉత్తమ హీరో అవార్డును పుష్పకు గాను హీరో అల్లు అర్జున్‌కు సిఎం రేవంత్ రెడ్డి అందించారు. మెమెంటోతో పాటు నగదు పరుస్కారం అందచేశారు. అలాగే బాలకృష్ణకు ఎన్టీఆర్ మెమోరియల్ అవార్డును అందచేశారు. ఈ సదర్భంగా అవార్టును అందించినందుకు అల్లు అర్జున, బాలకృష్ణలు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ పరంపర కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి సినీ ,రాజకీయ ప్రముఖులు భారీగా తరలి వచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి చీఫ్ గెస్ట్ గా హాజరయ్యారు. నేషనల్ అవార్డ్ విన్నార్ , 2024 పుష్ప 2కి బెస్ట్ యాక్టర్ గద్దర్ అవార్డ్ విన్నర్ అల్లు అర్జున్ కూడా అటెండ్ అయ్యారు. ఫంక్షన్ లోకి వస్తుండగా మీడియాతో అల్లు అర్జున్ పుష్ప స్టైల్ లో తగ్గేదేలే అంటూ సింబాలిక్ గా చూపించాడు. హీరోలు అల్లు అర్జున్, బాలకృష్ణ, విజయ్ దేవరకొండ, నిర్మాతలు దిల్ రాజ్, అల్లు అరవింద్, సీనియర్ హీరోయిన్స్ సుహాసినీ, జయసుధ, జయప్రద, సింగర్ సునీత, మంగ్లీ.,దర్శకులు రాజమౌళి, సుకుమార్, మురళీ మోహన్, కీరవాణి, సింగర్ రేవంత్ తదితరులు హాజరయ్యారు. ఈ వేడుక ప్రారంభమైన కొద్ది సేపటికి సీఎం రేవంత్ రెడ్డి హాజరయ్యారు. సీఎం రేవంత్ రెడ్డి, హీరో అల్లు అర్జున్ హాగ్ చేసుకోవడం ఈ కార్యక్రమంలో స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచింది. తమన్ మ్యూజిక్ షో, స్పెషల్ డాన్స్‌లు ఆకట్టుకున్నాయి. దేశ వ్యాప్తంగా తగ్గేదేలే డైలాగ్ ఎంత ఫేమస్ ప్రత్యేక చెప్పాల్సిన పనిలేదు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలిసారి తెలుగు చలనచిత్ర పరిశ్రమకు తెలంగాణ ప్రభుత్వం అవార్డులు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నంది అవార్డులు ఇవ్వగా 2014 నుంచి ఆ పక్రియ ఆగిపోయింది. మళ్లీ 10 ఏండ్ల తర్వాత ఇప్పుడు గద్దర్ అవార్డ్స్ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పురస్కారాలను అందిస్తోంది. 2014 నుంచి 2024 వరకు అత్యుత్తమ ప్రదర్శన కనబర్చిన సినిమాలకు, నటు-లు, దర్శకులు, టెక్నిషియన్లకు ప్రభుత్వం అవార్డులను ప్రకటించిన సంగతి తెలిసిందే.. సీఎం రేవంత్ రెడ్డి ఉత్తమ నటీనటులకు అవార్డులు ప్రదానం చేసారు.

# జగన్‌తో ములాఖత్ అయి కృష్ణా జలాల దోపిడీ

(మొదటి పేజీ తరువాయి)

సంప్రదించలేదని ప్రశ్నించారు. ఎపి రోజూ 3 టిఎంసిలు మళ్లిస్తుంటే కెసిఆర్ చోద్యం చూశారని.. జగన్, కెసిఆర్ మధ్య అవగాహనతోనే తెలంగాణ నీటిని ఎపికి దోచిపెట్టారని పేర్కొన్నారు. ఏపీ ప్రభుత్వం నిర్మించతలపెట్టిన గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు విషయంలో తెలంగాణ ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీశ్‌రావు చేసిన ఆరోపణలను మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తోసిపుచ్చారు. గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుపై నిర్ణయాత్మకంగా వ్యవహరిస్తున్నాం. జనవరి 22న కేంద్ర జలశక్తి, ఆర్థికశాఖ మంత్రులకు లేఖ రాశాను. ఆ ప్రాజెక్టుపై అభ్యంతరాలు తెలిపాను. బనకచర్ల ప్రాజెక్టుపై కాంగ్రెస్ పార్టీ మౌనం వహించలేదు. చట్టపరంగా ముందుకెళ్తున్నాం. హరీశ్‌రావు వాదనలు నిరాధారం, తప్పుదారి పట్టించేలా ఉన్నాయని మండిపడ్డారు. నదీ జలాల హక్కులపై తెలంగాణకు నష్టం చేసింది బీఆర్ఎస్సేనని ఆరోపించారు. పదేళ్ల పాలనా కాలంలో కృష్ణానది వాటాను కేవలం 299 టీఎంసీలకే పరిమితం చేశారు. బీఆర్ఎస్ హయాంలోనే ముచ్చుమర్రి, మాల్యాల నుంచి నీటిని తరలించారు. రాయలసీమ ఎత్తిపోతలపై అపెక్స్ కౌన్సిల్‌ను మీారెందుకు సంప్రదించలేదు. ఏపీ..రోజూ 3 టీఎంసీలు మళ్లిస్తోంటే కేసీఆర్ చోద్యం చూశారు. జగన్, కేసీఆర్ మధ్య అవగాహనతోనే తెలంగాణ నీటిని ఏపీకి దోచిపెట్టారని ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆరోపించారు. ఇవన్నీ కప్పిపుచ్చి బనకచర్ల ప్రాజెక్టు గురించి బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు చేసిన ఆరోపణలను చేయడాన్ని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తోసిపుచ్చారు. గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుపై నిర్ణయాత్మకంగా వ్యవహరిస్తున్నామని ఆయన అన్నారు. జనవరి 22న కేంద్ర జలశక్తి, ఆర్థికశాఖ మంత్రులకు లేఖ రాశానని.. బనకచర్ల ప్రాజెక్టుపై అభ్యంతరాలు తెలిపినట్లు- పేర్కొన్నారు. బనకచర్ల ప్రాజెక్టుపై కాంగ్రెస్ పార్టీ మౌనం వహించలేదని.. ప్రాజెక్టుపై చట్టపరంగా ముందుకెళ్తున్నామని తెలిపారు. ఈ విషయంలో హరీశ్‌రావు వాదనలు నిరాధారం, తప్పుదారి పట్టించేలా ఉన్నాయని ఉత్తమ్ మండిపడ్డారు.

# బనకచర్ల దోపిడీని అడ్డుకోవడంలో విఫలం

(మొదటి పేజీ తరువాయి)

మారిందో.. గోదావరి జలాలను తరలించుకుపోవడానికి బనకచర్ల అలా ఉపయోగపడుతుందని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. గోదావరి-బనకచర్ల లింక్ ప్రాజెక్ట్‌పై హరీశ్‌రావు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. బనకచర్ల ప్రాజెక్టు విషయంలో ఏపీ ప్రభుత్వం ముందుకెళ్తుంటే తెలంగాణ సీఎం, నీటిపారుదలశాఖ మంత్రి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. బనకచర్ల ప్రాజెక్టు ఏపీ ప్రభుత్వం నిర్మిస్తుంటే.. మన ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు ఉంది. ఇప్పటికైనా కళ్లు తెరవండి. ఇంకా ఎక్కువ నష్టం జరగక ముందే గోదావరి-బనకచర్లను అడ్డుకోండి. కాంగ్రెస్ ప్రభుత్వం చేసే ఏ పోరాటానికైనా మేం మద్దతిస్తాం. మీారు ముందుకు రాకపోతే భారాస పెద్ద ఎత్తున పోరాటం చేస్తుందని హరీశ్‌రావు తెలిపారు. ఏపీ ప్రభుత్వం ఈ నెలాఖరుకు టెండర్లు పిలిచేందుకు సన్నద్ధమవుతుంటే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిద్రపోతోంది. ఇరిగేషన్ శాఖామంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఉత్తుత్తి మాటలు మాట్లాడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం పెట్టడానికి రావట్లేదు. కేటీఆర్, ప్రతిపక్ష నేతలపై ఎలా కేసులు పెట్టాలనే దానిపైనే ప్రభుత్వానికి ధ్యాస తప్ప మరోటి లేదన్నారు. రాష్ట్ర ప్రయోజనాలు కాపాడాలనే ఆలోచన ఈ ప్రభుత్వానికి లేదు. గత రెండు కేంద్ర బడ్జెట్లు చూస్తే ఆంధ్రప్రదేశ్‌కు నిధుల వరద.. తెలంగాణకు గుండు సున్నా. నిధులు ఆంధ్రాకే, నదులు ఆంధ్రాకే.. తెలంగాణకు సున్నా.. ఇదీ దిల్లీ పాలకుల వైఖరి అని విమర్శలు చేశారు. నిధుల్లో, నదుల్లో తెలంగాణకు అన్యాయం జరిగినా ఈ రాష్ట్రంలో ఉన్న 8మంది కాంగ్రెస్ ఎంపీలు, 8 మంది భాజపా ఎంపీలు నోరు విప్పడం లేదు. రాష్ట్రానికి చెందిన ఇద్దరు కేంద్ర మంత్రుల నుంచి ఎలాంటి స్పందన లేదు. గోదావరి- బనకచర్లకు కేంద్రంలోని భాజపా ప్రభుత్వం నిధులు ఇచ్చి సహకరిస్తోంది. తెలంగాణ భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసే హక్కు మీాకు ఎవరు ఇచ్చారు. 2 టీ-ఎంసీల బాబ్లీ నీటి కోసం చంద్రబాబు 2008లో పెద్ద పోరాటం చేశారు. 200 టీఎంసీలతో అక్రమ ప్రాజెక్టు కడుతుంటే తెలంగాణ ప్రభుత్వం ఎంత పోరాటం చేయాలి. రాజకీయాల కంటే రాష్ట్ర భవిష్యత్తే భారాసకు ముఖ్యం అన్నారు.

# లక్కీ నంబరే కొంపముంచిందా?

(మొదటి పేజీ తరువాయి)

అంతకుముందు రెండుసార్లు వెళ్లేందుకు సిద్ధమై టికెట్ రద్దు చేసుకున్నట్లు తెలిసింది. చివరకు మూడోసారి బయలుదేరినప్పటికీ గమ్యాన్ని చేరకముందే విమాన ప్రమాదంలో ఆయన ప్రాణాలు కోల్పోయారు. అంతేకాదు ఆయన లక్కీ నంబర్‌గా భావించే '1206' సంఖ్య కలిగిన తేదీనే ఆయనకు చివరి ప్రయాణం అయ్యింది. రూపాణీ వ్యక్తిగత వాహనాలన్నీ అదే నంబరుతో ఉన్నట్లు సమాచారం. అయితే ఆ లక్కీ నెంబరే గుజరాత్ మాజీ సీఎం విజయ్ రూపానీ ప్రాణం తీసిందనే ఓ చర్చ అయితే ప్రస్తుతం వైరల్ అవుతోంది. విజయ్ రూపానీ లక్కీ నెంబర్ 1206. ఆయన ముఖ్యమంత్రిగా ఉండగా.. ఈ నెంబరే తన అధికారిక వాహనానికి పెట్టుకున్నారు. అలాగే ఆయన సొంత వాహనాలు.. కారు, స్కూటర్‌లకు సైతం ఇదే నెంబర్ వచ్చేలా ఆయన చూసుకున్నారు. అయితే ఆయన.. తన లండన్ ప్రయాణాన్ని సైతం లక్కీ నెంబర్ వచ్చేలా చూసుకున్నారు. కానీ తాను ఒకటి తలిస్తే దైవం ఒకటి తలిచినట్లుగా.. ఆ రోజు ప్రయాణమే ఆయనకు చివరి ప్రయాణం కావడం గమనార్హం. ఈ లక్కీ నెంబర్ రోజు తన ప్రయాణాన్ని ఆయన వరుసగా రెండు సార్లు టికెట్ బుక్ చేసుకుని మరీ రద్దు చేసుకున్నారు. మాజీ సీఎం విజయ్ రూపానీ కుమార్తె లండన్‌లో ఉన్నత విద్యను అభ్యసిస్తోంది. ఈ నేపథ్యంలో విజయ్ రూపానీ భార్య ఇప్పటికే లండన్‌లో కుమార్తె వద్ద ఉన్నారు. దీంతో కుమార్తె వద్ద కొన్ని రోజులు ఉండి.. తిరుగు ప్రయాణంలో భార్యను తన తీసుకు రావాలని మాజీ సీఎం విజయ్ రూపానీ భావించారు. అందులో భాగంగా తొలుత లండన్ వెళ్లేందుకు మే 19వ తేదీన ఆయన విమాన టికెట్ బుక్ చేసుకున్నారు. ఆ తర్వాత దీనిని రద్దు చేసుకున్నారు. అనంతరం జూన్ 5వ తేదీన లండన్ వెళ్లాలని ఆయన భావించారు. కానీ ఆ టికెట్‌ను సైతం ఆయన రద్దు చేసుకున్నారు. చివరగా తన లక్కీ నెంబర్ కలిసేలా జూన్ 12వ తేదీన ఆయన లండన్ వెళ్లాలని నిర్ణయించుకున్నారు. దీంతో ఎయిర్ ఇండియా విమానంలో 12డీ నెంబర్ సీటును ఆయన ప్రత్యేకంగా బుక్ చేసుకున్నారు. ఆ క్రమంలో ఈ ప్రయాణంలో తన లక్కీ నెంబర్‌గా భావించిన రోజే ఆయన మరణించారు. జూన్ 12వ తేదీ 1.38 గంటలకు గుజరాత్‌లోని అహ్మదాబాద్ నుంచి లండన్ బయలుదేరిన ఎయిర్ ఇండియా విమానం కొన్ని నిమాషాలకే కుప్ప కూలి మంటల్లో దగ్ధమైంది. అందులో రూపానీ కూడా ఉన్నారు.

# నీట్ యూజీ ఫలితాలు వచ్చేశాయ్

(మొదటి పేజీ తరువాయి)

అధికారిక వెబ్‌సైట్ https://neet.nta.nic.in ద్వారా ఫలితాలను చెక్ చేసుకోవచ్చని ఎన్టీఏ వెల్లడించింది. ఈ ఫలితాల్లో రాజస్థాన్‌కు చెందిన మహేశ్ కుమార్ ఫస్ట్ ర్యాంక్ సాధించారు. మధ్యప్రదేశ్‌కు చెందిన ఉత్కర్ష్ అవదియా రెండో ర్యాంకు, మహారాష్ట్రకు చెందిన క్రిషాంగ్ జోషి మూడో ర్యాంక్, ఢిల్లీ-ఎన్సీటీకి చెందిన మృణాల్ కిషోర్ ఝూ నాలుగో ర్యాంక్, అవికా అగర్వాల్ ఐదో ర్యాంక్ సాధించారు. ఇక ఈ ఫలితాల్లో తెలంగాణ విద్యార్థులు టాప్ 100లో పలు ర్యాంకులను సాధించారు. జీవన్ సాయికుమార్ 18వ ర్యాంక్.. షణ్ముఖ నిషికాంత్ అక్షింతల 37వ ర్యాంక్, ఎం వరుణ్ 46వ ర్యాంక్, వై షణ్ముఖ్ 48వ ర్యాంక్, విదిశా మాజీ 95వ ర్యాంకులను కైవసం చేసుకున్నారు. ఏపీకి చెందిన కార్తీక్ రామ్ కిరిటి 19వ ర్యాంకు, కొడవటి మోహిత్ శ్రీరామ్ 56వ ర్యాంక్, దేశిన సూర్య చరణ్ 59వ ర్యాంక్, పి. అవినాశ్ 64వ ర్యాంక్, వై. సమీర్ కుమార్ 70వ ర్యాంక్, టి. శివమణిది 92వ ర్యాంక్ సాధించారు. తెలంగాణ రాష్ట్రంలో 33 ప్రభుత్వ మెడికల్, రెండు డీమ్డ్, 29 ప్రైవేట్ మెడికల్ కాలేజీలున్నాయి. వీటిలో మొత్తంగా 8,515 ఎంబీబీఎస్ సీట్లున్నట్లు సమాచారం. గత నెల మే 4వ తేదీన దేశవ్యాప్తంగా జరిగిన నీట్ యూజీ పరీక్షకు 20.8 లక్షల మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. 5,400కు పైగా కేంద్రాల్లో పటిష్ఠ భద్రత మధ్య ఈ పరీక్షను నిర్వహించారు. విదేశాల్లోని 14 కేంద్రాల్లోనూ నీట్ యూజీ పరీక్ష జరిగింది. ఈ సారి నీట్ యూజీ పరీక్షకు హాజరయ్యే వారి సంఖ్య తగ్గింది. నిరుడు జాతీయంగా 23లక్షలకుపైగా అభ్యర్థులు ఈ పరీక్షలకు హాజరు కాగా, ఈ సారి 20లక్షల మంది మాత్రమే రాశారు. ఈ సారి తెలంగాణ రాష్ట్రం నుంచి 72,507 మంది అభ్యర్థులు నీట్ యూజీ పరీక్షను రాశారు.

# మావోయిస్టులకు ఎదురుదెబ్బ..

(మొదటి పేజీ తరువాయి)

పోలీసులు, హాక్ ఫోర్స్ సంయుక్త బృందం ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించింది. ఈ క్రమంలో ఆ ప్రాంతంలో బలగాలు సెర్చ్ ఆపరేషన్ నిర్వహిస్తుండగా ఎన్‌కౌంటర్ జరిగింది. నక్సల్స్ నుంచి పెద్దమొత్తంలో మందుగుండును స్వాధీనం చేసుకున్నారు. సమాచారం మేరకు.. పచామా దాదర్ దట్టమైన అడవుల్లో మావోల కదలికలపై పోలీసులకు పక్కా సమాచారం అందింది. దాంతో భద్రతా దళాలు ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టి సెర్చ్ ఆపరేషన్ ప్రారంభించాయి. ఈ సమయంలో మావోయిస్టులు కాల్పులు జరిపారు. దాంతో భద్రతా బలగాలు సైతం తిరిగి కాల్పులు జరుపడంతో నలుగురు మావోలు మరణించారు.మావోయిస్టుల నుంచి గ్రెనేడ్ లాంచర్, ఎస్ఎల్ఆర్, నాలుగు రైఫిల్స్, ఇతర ఆయుధాలు, సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. చనిపోయిన వారంతా జీఆర్‌బీ (గోందియా-రాజ్‌నంద్‌గావ్-బాలాఘాట్)కు చెందిన వారని ఎస్పీ ఆదిత్య మిశ్రా తెలిపారు. ఎన్‌కౌంటర్ తర్వాత సెర్చ్ ఆపరేషన్ కొనసాగిస్తున్నట్లు ఎస్పీ పేర్కొన్నారు. ఇంకా అటవీ ప్రాంతంలో మావోలు ఉన్నట్లుగా అనుమానిస్తున్నారు. ఇటీవల బాలాఘాట్ ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన ఆదిత్య మిశ్రా.. మిషన్-2026లో భాగంగా మావోల నిర్మూలనకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు.

# నేటీ నుంచి కెనడాలో జీ7 సదస్సు

(మొదటి పేజీ తరువాయి)

జరుపుతారు. రెండు దశాబ్దాలుగా ఆ దేశంలో భారత ప్రధాని పర్యటించడం ఇదే ప్రథమం. అధ్యక్షుడు క్రిస్టోడౌలిడెస్‌తో చర్చల అనంతరం లిమాసోల్‌లో వ్యాపార దిగ్గజాలను ఉద్దేశించి మోదీ ప్రసంగిస్తారు. రెండు దేశాల మధ్య దౌపాక్షిక సంబంధాల పటిష్టతకు మోదీ పర్యటన దోహదం కానుంది. అనంతరం కెనడాకు మోదీ బయలుదేరి వెళ్తారు. కెనడా ప్రధాని మార్క్ కార్నే ఆహ్వానం మేరకు జూన్ 16-17 తేదీల్లో జరిగే జీ-7 సదస్సులో మోదీ పాల్గొంటారు. జీ-7 సదస్సులో మోదీ పాల్గొనడం వరుసగా ఇది ఆరోసారి. సదస్సు సందర్భంగా పలు దైపాక్షిక సమావేశాల్లోనూ ప్రధాని పాల్గొంటారు. ప్రధాని తన పర్యటన చివర్లో క్రొయేషియాలో పర్యటిస్తారు. క్రొయేషియా ప్రధాని ఆండ్రెజ్ ప్లెంకోవిక్ ఆహ్వానం మేరకు జూన్ 18న ఆ దేశంలో అధికారిక పర్యటన జరుపుతారు. క్రొయేషియాలో భారతదేశ ప్రధానమంత్రి ఒకరు పర్యటించనుండటం ఇదే మొదటిసారి. ద్వైపాక్షిక సంబంధాల్లో ప్రధాని పర్యటన ఒక మైలురాయి కానుంది. ప్రధాని ప్లెంకోవిక్, అధ్యక్షుడు జోరన్ మిలనోవిక్‌తో మోదీ సమావేశమవుతారు. యూరోపియన్ యూనియన్ భాగస్వాములతో మరింత పటిష్ట బంధాల గురించి చర్చిస్తారు.

# వరుసగా రెండో రోజూ ఏఐజీ ఆస్పత్రికి కేసీఆర్

(మొదటి పేజీ తరువాయి)

వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకున్న కెసిఆర్ మరోసారి ఆస్పత్రికి వెళ్లారు. వైద్య పరీక్షలు పూర్తి అయిన తర్వాత నందీనగర్‌లోని నివాసానికి వెళ్లనున్నారు. ఐదు రోజుల పాటు- నందీనగర్ నివాసంలో కేసీఆర్ ఉండనున్నారు. ప్రతీ రెండు నెలలకు ఒకసారి కేసీఆర్ ఆస్పత్రికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకుంటారు. గతంలో యశోదా ఆస్పత్రికి కేసీఆర్ తరచుగా వెళ్తుండేవారు. అయితే ఈసారి గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రికి వెళ్లారు. నిన్న సాయంత్రం ఎర్రవల్లి ఫాంహౌస్‌లోని ఆయన నివాసం నుంచి హైదరాబాద్ వచ్చిన కేసీఆర్.. ఏఐజీ ఆస్పత్రికి వెళ్లి వైద్యులను సంప్రదించారు. మళ్లీ ఈరోజు కూడా రావాల్సిందిగా వైద్యులు సూచించారు. వైద్యుల సూచనల మేరకు నేడు ఆస్పత్రికి వెళ్లి ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. గడిచిన ఏడాదిన్నర కాలంగా కేసీఆర్ ఎర్రవల్లి ఫాంహౌస్‌లోని ఆయన నివాసంలోనే ఉంటు-న్నారు. అందుబాటు-లో ఉండాలని వైద్యులు చెప్పిన నేపథ్యంలో బంజారాహిల్స్‌లోని నందినగర్‌లోనే ఉండనున్నారు. ఇక కాళేశ్వరం కమిషన్ విచారణకు ఈనెల 11న మాజీ సీఎం హాజరైన విషయం తెలిసిందే. ఆ సమయంలో కూడా తనకు జలుబు ఉందని కమిషన్ చైర్మన్ పీసీ ఘోష్‌కు చెప్పారు. ఓపెన్ కోర్టులో విచారణ వద్దని కేసీఆర్ కోరగా.. ఆయన వినతిని పరిగణలోకి తీసుకున్న కమిషన్ చైర్మన్ బహిరంగ విచారణను రద్దు చేశారు. ఇండోర్‌లోనే కేసీఆర్‌ను కమిషన్ ముఖాముఖిగా విచారించింది.

# తెలంగాణలో స్థానిక ఎన్నికల సందడి

(మొదటి పేజీ తరువాయి)

అనుకోవచ్చు. ఇటీవల మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, సీతక్క తదితరులు వరుస ప్రకటనలు చేస్తున్నారు. అలాగే రెవెన్యూ సదస్సుల పేరుతో మంత్రులు జిల్లాల పర్యటనలు చేసేస్తున్నారు. ఇదంతా ఓ రకంగా ప్రజల్లో తమ బలాన్ని మరింత పెంచుకునేలాచేసే యత్నమని గుర్తించాలి. ఈ క్రమంలో గ్రామాల్లో రాజకీయ వేడి రాజుకుంటోంది. కొన్ని రోజులుగా రాజకీయ పార్టీల సందడి జోరుగా కనిపిస్తోంది. ఇప్పటికిప్పుడు ఎన్నికలు లేకున్నా ఖాళీగా కూర్చునే ఆలోచనలో లేరు. పార్టీలన్నీ ఏదో ఓ కార్యక్రమంతో ప్రజల్లోకి వెళుతున్నాయి. నిత్యం ప్రజల్లోనే ఉంటున్నాయి. నేతలంతా ఏదో ఒక కార్యక్రమంలో ముందుకు సాగుతున్నారు. తెలంగాణలో బిజెపి, కాంగ్రెస్, బిఆర్ఎస్ కూడా నిత్యం కార్యక్రమాలతో ప్రజల్లోకి వెళుతోంది. ఇలా జిల్లాల్లో ప్రధాన రాజకీయ పక్షాలు ప్రజాక్షేత్రంలోకి వెళ్లి బలోపేతం కావడానికి ప్రయత్నాలు చేస్తున్నాయి. ఒక్కో పార్టీ ఒక్కో పేరిట ప్రజల్లోకి వెళ్లి తమ వాణిని వినిపిస్తున్నాయి. బిఆర్ఎస్ దీనిని బాగా ఉపయోగించుకుంటోంది. తెలంగాణ మొత్తం అభివృద్ధి చెందిందన్న ప్రచారంతో ప్రజలను బురిడీ కొట్టిస్తోంది. తెలంగాణ సస్యశ్యామలం కావడమే గాకుండా బంగారు తునకగా మారిందన్న ప్రచారంతో నేతలు, అధినేతలు తరిస్తున్నారు.

## 2025 జూన్ 15, ఆదివారం తెలుగు పంచాంగం




మాసం - పక్షం
మాసం: జ్యేష్ఠమాసం (అమాంత)
పక్షం: కృష్ణపక్షం
తిథి
షష్ఠి: జూన్ 14 రాత్రి 10:56 -జూన్ 15 రాత్రి 11:49
సప్తమి: జూన్ 15 రాత్రి 11:49 -జూన్ 16 రాత్రి 12:46
నక్షత్రం
ఉత్తరాషాఢ: జూన్ 14 ఉదయం 1:55 - జూన్ 15 మధ్యాహ్నం 1:55
అభిజిత్ నక్షత్రం (మార్గశిర/స్వాతి ప్రారంభ సమయం): జూన్ 15 మధ్యాహ్నం 1:55 - జూన్ 16 మధ్యాహ్నం 2:30
సూర్యోదయం - సూర్యాస్తమయం
సూర్యోదయం: ఉదయం 5:47
సూర్యాస్తమయం: సాయంత్రం 6:48
చంద్రోదయం - చంద్రాస్తమయం
చంద్రోదయం: రాత్రి 2:30 (15 జూన్)
చంద్రాస్తమయం: రాత్రి 3:25 (16 జూన్)
శుభ సమయాలు
బ్రహ్మ ముహూర్తం: ఉదయం 4:09 - 4:57
అభిజిత్ ముహూర్తం: మధ్యాహ్నం 11:51- 12:43
అమృతకాలం: రాత్రి 7:25 -9:05
అశుభ సమయాలు
రాహుకాలం: 3:32 PM -5:10PM
యమగండం: 10:40 AM - 12:18PM
గులిక కాలం: 1:56 PM-3:34PM
దుర్ముహూర్తం: మధ్యాహ్నం 12:22 - 1:14 PM సాయంత్రం 3:05 -3:57PM
వర్జ్యం: రాత్రి 7:25- 9:05

# ఏసీబీ నోటీసులపై భగ్గుమన్న మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్



**దేవరకొండ, జూన్ 14(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఏసీబీ మరోసారి నోటీసులు జారీ చేయడాన్ని బీఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్ తీవ్రంగా ఖండించారు. ఏసీబీ అధికారులు గతంలో కేటీఆర్‌ను సుదీర్ఘంగా విచారించినప్పటికీ, ఎలాంటి అవినీతి ఆరోపణలు నిరూపించలేకపోయారని ఆయన గుర్తు చేశారు. ఫార్ములా–ఈ రేస్ సజావుగా సాగిందని, ఇందులో ఎలాంటి అక్రమాలు జరగలేదని, అయినప్పటికీ కేటీఆర్‌ను విచారించడం అన్యాయమని అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల దృష్టిని మళ్లించేందుకు ఇటువంటి చర్యలు చేపడుతోందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయలేకపోతున్న నేపథ్యంలో, రాజకీయ కుయుక్తులకు పాల్పడుతోందని విమర్శించారు. హైదరాబాద్‌లో ఫార్ములా–ఈ రేస్ నిర్వహించడం ద్వారా నగరానికి అంతర్జాతీయ గుర్తింపు లభించిందని, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు మార్గం సుగమం అయ్యిందని ఆయన పేర్కొన్నారు.

# జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో 152 కేసుల పరిష్కారం

-రూ.4 లక్షల జరిమానా ప్రభుత్వ ఖాతాలో జమ




**ఆమనగల్, జూన్ 14(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
దేశవ్యాప్తంగా శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో ఆమనగల్ జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో న్యాయ సేవల పరంగా మరో అడుగు ముందుకేసింది. ఈ అదాలత్‌లో మొత్తం 152 కేసులు సవ్యంగా పరిష్కరించబడ్డాయి. కేసుల పరిష్కార ఫలితంగా రూ.4,00,400 జరిమానా ప్రభుత్వ ఖాతాలో ఫైన్ రూపంలో జమ అయినట్టు ప్రథమ శ్రేణి న్యాయమూర్తి స్వరూప కాటం తెలిపారు. ఈ సందర్భంగా కోర్టు ప్రాంగణం న్యాయవిధానంతో నిండిపోవడంతో పాటు ప్రజలకు వేగవంతమైన న్యాయం లభించేలా అదాలత్ విధానం ఎంతగానో ఉపకరిస్తుందని న్యాయమూర్తి వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీపీ బి. కార్తీక్, ఆమనగల్ సీఐ వి. జానకిరామ్ రెడ్డి, ఎస్ఐ బి. వెంకటేష్, కడ్తాల్ సీఐ సిహెచ్. గంగాధర్, మాడుగుల్ సీఐ టి. వేణుగోపాల్, ఎస్ఐ రాఘవేందర్, తలకొండపల్లి ఎస్ఐ ఏ. శ్రీకాంత్, ఎక్సైజ్ సీఐ బధ్యానాయక్ పాల్గొన్నారు. కోర్టు సిబ్బంది, కానిస్టేబుళ్ల సహకారంతో కార్యక్రమం నిబద్ధతతో నిర్వహించబడింది.

# యువత స్వయంకృషితో ఎదగాలి

- మాజీ జెడ్పిటిసి జర్పుల దశరథ్ నాయక్



**కడ్తాల్, జూన్ 14(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
యువత స్వయంకృషితో ఎదగాలని కడ్తాల్ మాజీ జెడ్పిటిసి, లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు జర్పుల దశరథ్ నాయక్ అన్నారు. యువత ఒకరిపై ఆధారపడకుండా స్వయంకృషితో ఎదిగినప్పుడే దేశం అభివృద్ధిలో పయనిస్తుందని తెలిపారు. ఉన్నత విద్యను అభ్యసించి ఉద్యోగాలు రాలేదని నిరాశ చెందకుండా తమలో ఉన్న ప్రతిభను వెలికి తీసి స్వయంకృషితో ఎదగాలని అన్నారు. శనివారం మండలంలోని సలార్పూర్ గ్రామంలో మౌనిక మహేష్ దంపతులు నూతనంగా ఏర్పాటుచేసిన శ్రీ మణికంఠ డిజిటల్ ఫోటో స్టూడియోను ఆయన చేతుల మీదుగా ప్రారంభించారు. స్వయంకృషితో వ్యాపారం ప్రారంభించిన సందర్భంగా వారిని శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సువాలి పంతు ఎంపీటీసీ ప్రియ రమేష్ మాజీ డైరెక్టర్ లాక్ అలీ మాజీ వార్డు సభ్యులు బాబా శంకర్ జగన్ నాయకులు అంజద్ నరేష్ హైదర్ జంగయ్య రమేష్ గోపాల్ కుమార్ లక్ష్మణ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను కలిగి ఉండాలి

-- మాజీ జెడ్పిటిసి దశరథ్ నాయక్



**కడ్తాల్, జూన్ 14,**
నేటి సమాజంలో ప్రతి ఒక్కరు ధర్మాన్ని పాటించేందుకు ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని కడ్తాల్ మాజీ జెడ్పిటిసి, లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు జర్పుల దశరథ్ నాయక్ అన్నారు. కడ్తాల్ మండలంలోని హనుమాస్ పల్లి గ్రామంలో హనుమాన్ ఆలయంలో ప్రతి నెల రెండో శనివారం ఆంజనేయ స్వామి వ్రతం నిర్వహిస్తారు. ఈ శనివారం సంతోష దేవనాయక్ దంపతులు ప్రత్యేక వ్రతం నిర్వహించారు. ఈ పూజకు లంబాడ హక్కుల పోరాట సమితి ఉపాధ్యక్షులు జర్పుల దశరథ్ నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొని వ్రతం నిర్వహించిన సంతోష దేవా నాయక్ దంపతులను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రంగయ్య,మాజీ డైరెక్టర్ లయక్ అలీ,నాయకులు మహేష్ యాదవ్ ,శ్రీను నాయక్ ,నిరంజన్ గౌడ్, రాజు, యాదయ్య, మల్లయ్య ,మహేష్ శేఖర్ C జాన్య నాయక్ ,శేఖర్ ,శివ, శ్రీనివాస్ గౌడ్,జీడిఎన్ వ్యవస్థాపక అధ్యక్షులు రమేష్,నరేష్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బస్ పాస్ ధరల పెంపుపై బిఆర్ఎస్వీ తీవ్ర నిరసన



**దేవరకొండ, జూన్ 14(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ప్రభుత్వం తీసుకున్న బస్ పాస్ ఛార్జీ పెంపు నిర్ణయం ప్రజలపై తీవ్ర భారంగా మారిందని బిఆర్ఎస్వీ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ మండిపడ్డారు. శనివారం దేవరకొండ పట్టణంలో జరిగిన సమావేశంలో విద్యార్థుల భవిష్యత్తును నిర్లక్ష్యం చేస్తూ,అనేక రూట్లలో బస్సులు నడపకుండా వారికి సంక్షోభాన్ని పెంచుతున్నారని ఆయన ఆరోపించారు. ప్రజలను దోచుకోవడమే కాంగ్రెస్ ప్రభుత్వ విధానంగా మారిందని విమర్శించిన ఆయన, పేద విద్యార్థులపై ఆర్థిక భారం మోపుతూ ఖజానా నింపుకునే ప్రయత్నాన్ని తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఆయన కోరారు.

# విరబూసిన బ్రహ్మ కమలం



**జూన్ 14(నీలగిరి ఎక్స్‌ప్రెస్) ఎల్ బి నగర్ నియోజకవర్గ ప్రతినిధి**
వనస్థలిపురం డివిజన్ పరిధిలోని హుడా సాయి నగర్ కాలనీ నందు సూదం పద్మ సాగర్ ఇంట్లో శనివారం రెండు బ్రహ్మకమలాలు వీరబుయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతియేటా ఇంట్లో దాదాపు ఆరు బ్రహ్మకమలాలు పూస్తాయి అని తెలిపారు.

# రోడ్డు విస్తరణ పనులపై ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ను కలసిన పట్టణ వ్యాపారవేత్తలు








**షాద్ నగర్, జూన్ 14(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం లో షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ను మర్యాద పూర్వకంగా కలసిన పట్టణ వ్యాపారస్తులు, ఇటీవల జరిగిన మున్సిపల్ శాఖ వారు మెయిన్ రోడ్డు విస్తరణ కు శ్రీకారం చుట్టడం తో వ్యాపారస్తులు ఎమ్మెల్యే ను కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ త్వరలో అందరితో సమావేశం ఏర్పాటు చేసుకొని అందరికీ ఉపయోగపడే విధంగా రోడ్డు పనులను చేపడతానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే ను కలిసిన వారిలో పట్టణ ప్రముఖులు అగ్గనూర్ విశ్వం,అగ్గనూర్ బస్వం, గజవాడ నరసింహులు, లష్కర్ ఆంజనేయులు,గందే సురేష్,పలబట్ల రాంమోహన్,, కొత్రా రఘు, ,కమ్మదానం సుధాకర్,యంసాని శ్రీనివాస్ ,నాగిళ్ళ ప్రభాకర్, రాజు కూచూరి ప్రవీణ్,రవి చారి, గార్లపాటి శ్రీనివాస్,సుదర్శన్,శంశీర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని నిలువరించాలి

-ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలి..
-మాజీ సైనికుడు దుగ్యాని వెంకటయ్య డిమాండ్



**కొండమల్లేపల్లి, జూన్ 14(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఫీజుల దోపిడీని నిలువరించి తక్షణమే ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని మాజీ సైనికుడు డి.వెంకటయ్య డిమాండ్ చేశారు. విద్యాశాఖ అధికారులు తక్షణమే ప్రైవేట్ విద్యా సంస్థల్లో జరుగుతున్న దోపిడీపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. స్కూల్ ఫీజు కాకుండానే బుక్స్ పేరుతో,యూనిఫామ్ పేరుతో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక మొత్తంలో వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా పండగలకు, స్కూల్ ఫేర్వెల్ ఫంక్షన్లకు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారన్నారు. ప్రైవేట్ విద్యా సంస్థలు టెక్నో,ఈ టెక్నో,ఐఐటి,ఇంటర్నేషనల్ సీబీఎస్ఈ,ఒలింపియాడ్,తదితర పేర్లతో తల్లిదండ్రులను మోసం చెస్తూ అధిక మొత్తంలో ఫీజులు దండుకుంటున్నారని తెలిపారు. ప్రైవేటు విద్యా స0స్థల్లో ఎక్కడ విద్యాహక్కు చట్టం అమలు కావడం లేదన్నారు. 25శాతం ఉచిత సీట్లు కూడా ఇవ్వడం లేదని..ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేటు విద్యాసంస్థలు గా నడు స్తున్న స్కూల్స్ ప్రభుత్వ జీవోలను చట్టాలను అమలు చేయడం లేదన్నారు.

# దశదిన కర్మలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్



**ఆమనగల్, జూన్ 14(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఆమనగల్ మండలం ఆకుతోటపల్లి గ్రామంలో శనివారం జరిగిన దశదినకర్మకు మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్ హాజరయ్యారు. బిఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షులు బర్ల వేంకటయ్య తమ్ముడు బర్ల యాదగిరి ఇటీవల మృతి చెందారు. ఆయన దశదినకర్మ వారి నివాసంలో నిర్వహించగా మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ హాజరై బర్ల యాదగిరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని వారు అన్నారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట మాజీ జడ్పీటీసీ పత్యా నాయక్, మాజీ సర్పంచ్ శ్రీను, బిఆర్ఎస్ నాయకులు రంగయ్య, జర్నలిస్ట్ తిరుపతి గౌడ్, మహేష్, నిట్ట బుచ్చయ్య, బర్ల బాలయ్య, జంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

## పాఠకులకు గమనిక:




మీరు ఎదుర్కొంటున్న సమస్యలను వివరణాత్మకంగా మాకు తెలియజేయండి. ప్రభుత్వ అధికారుల మరియు ప్రజల మధ్య వారధిగా నిలిచి, మా ప్రత్యేక విలేకరుల బృందం సంబంధిత అధికారులను సంప్రదించి, పరిష్కారం కోసం కృషి చేస్తుంది.

నిజం బయటికి తీయడం కోసం , నిజాయితీ కోసం నీలగిరి ఎక్స్‌ప్రెస్! న్యూస్ సంప్రదించండి.

అన్నివేళలా మీతో పాటు ఉంటుంది

ఇమెయిల్: neelagiriexpress@gmail.com

సంప్రదింపు నెంబర్: 9705770909

మీ ప్రతిభావంతమైన భాగస్వామ్యంతో సమాజానికి మంచి మార్పు తీసుకురావడం మా లక్ష్యం.

**మీ గొంతుకకు మేమే వేదిక - నీలగిరి ఎక్స్‌ప్రెస్!**

# 15న ఆర్యవైశ్య నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం



సూర్యాపేట ,జూన్ 14(నీలగిరి ఎక్స్‌ప్రెస్)

సూర్యాపేట జిల్లా ఆర్యవైశ్య మహాసభ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవానికి జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆర్యవైశ్యులంతా విచ్చేసి విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కౌన్సిల్ సభ్యులు బండారు రాజా తెలిపారు. శనివారం ప్రమాణ స్వీకార మహోత్సవ మహాసభను విజయవంతం చేయాలని కోరుతూ సూర్యాపేట జిల్లా కేంద్రంలో పలువురు ఆర్యవైశ్యులకు జిల్లా కోశాధికారి చల్లా లక్ష్మీకాంత్ తో కలిసి ప్రమాణ స్వీకారం కరపత్రాలను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈనెల 15న కోదాడలోని గుడుగుంట్ల అప్పయ్య ఫంక్షన్ హాల్ లో ఉదయం 10 గంటలకు ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమాన్ని కన్నుల పండుగ నిర్వహించుటకు అన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ ప్రమాణ స్వీకార మహోత్సవానికి రాష్ట్ర మంత్రులతో పాటు రాష్ట్ర ఆర్యవైశ్య మహా సభ నాయకులు విచ్చేస్తున్నందున ఆర్యవైశ్యుల ఐక్యత చాటుటకు పెద్ద ఎత్తున తరలి రావాలనిపిలుపునిచ్చారు. గుడికైన,బడికైన,సమాజ సేవకైన ఆర్యవైశ్యుల్లే ముందుంటారనీ,మన ఆర్యవైశ్యుల ఐక్యత ను నిరూపించుటకు ఎన్ని పనులు ఉన్న ఒక్క రోజు వాయిదా వేసుకొని మన సత్తా ఏమిటో చూపాలన్నారు.ఎక్కువగా వ్యాపారాలు చేస్తూ ప్రభుత్వ ఖజానా ఆదాయం సమకూర్చి ఆర్యవైశ్యులు రాజకీయంగా ముందుకు సాగలేకపోతున్నారని, అన్ని రంగాల్లో ఆర్యవైశ్యులు తమ సత్తా చాటాలంటే మన ఐక్యతను చాటి చూపాల్సిన అవసరం ఉందన్నారు. దేవాలయాలు అభివృద్ధి జరగాలంటే ఆర్యవైశ్యుల పాత్ర ఎనలేనిదనీ, త్వరలో జరగబోవు దేవాలయ నామినేట్ పోస్టుల్లో ఆర్యవైశ్యులకే అధికంగా ప్రాముఖ్యత ఇవ్వాలన్నారు. ఊరువాడ ఏకమై మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షులు తప్పీ గాంధీ, నరేంద్రుని విద్యాసాగర్ రావు, గోపారపు రాజు, బచ్చు పురుషోత్తం, కొండ శ్రీనివాసరావు,నాయకులు బొల్లం సురేష్, ఉప్పలంచు కృష్ణ, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# షాద్ నగర్ లో ముగిసిన జాతీయ లోక్ అదాలత్

**-656 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు.... 11లక్షల 78 వేల 500 జరిమానా వసూలు**

**-259 క్రిమినల్ కేసులు....2 సివిల్ తగాదాలు... 2 బ్యాంకు కేసుల పరిష్కారం**

**-క్రిమినల్ కేసులకు సంబంధించి 5 లక్షల 98 వేల రూపాయల జరిమానాలు వసూళ్లు**

**-లోక్ అదాలకు విజయవంతం చేసినందుకు ప్రతి ఒక్కరికి అభినందనలు తెలిపిన మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ పి ఆంజనేయులు**

**-లోక్ అదాలత్ కార్యక్రమంలో పాల్గొన్న సీనియర్ సివిల్ జడ్జి స్వాతి రెడ్డి, జూనియర్ సివిల్ జడ్జి కొత్త రవి**



షాద్ నగర్, జూన్ 14(నీలగిరి ఎక్స్ ప్రెస్)

జాతీయ లోక్ అదాలత్ ఆదేశాలను అనుసరించి సోమవారం నుండి ఈరోజు శనివారం వరకు షాద్ నగర్ కోర్టు కాంప్లెక్స్ లో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. రాజీ మార్గమే రాజమార్గం లక్ష్యంగా సాగిన ఈ జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో ప్రత్యేక కోర్ట్ కూడా ఏర్పాటు చేశారు. ప్రత్యేక కోర్టు జడ్జిగా రవీంద్ర సింగ్ ను నియమించగా ఆయన డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు, పిట్టి కేసులు, మైనర్లకు వాహనాలు ఇచ్చిన యజమానుల కేసులు, డ్రైవింగ్ లైసెన్స్ లేని వారి కేసులు పరిష్కరించారు. ఈ కేసులకు సంబంధించి 11 లక్షల 78 వేల 500 రూపాయల జరిమానాలు విధించారు. కక్షిదారులకు త్వరగా న్యాయం చేకూర్చే ఉద్దేశంతో ఏర్పాటు చేయబడిన లోక్ అదాలత్ ను వినియోగించుకుని రెండు సివిల్ తగాదాలు, రెండు బ్యాంకు తగాదా సెటిల్మెంట్లు, 259 క్రిమినల్ కేసులు పరిష్కరించబడ్డాయి. జాతీయ లోక్ అదాలత్ ఆదేశాల ప్రకారం షాద్ నగర్ కోర్టు కాంప్లెక్స్ లో నిర్వహించబడిన జాతీయ లోక్ అదాలత్ విజయవంతమైనందుకు మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ పి ఆంజనేయులు, సీనియర్ సివిల్ జడ్జి స్వాతి రెడ్డి, జూనియర్ సివిల్ జడ్జి కొత్త రవి పోలీసులకు, న్యాయవాదులకు, కోర్టు సిబ్బందికి అభినందనలు తెలియజేశారు. జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో పట్టణ న్యాయవాదులు, నియోజకవర్గం లోని ఆరు మండలాల పోలీసు సిబ్బంది, కోర్టు సిబ్బంది మరియు కక్షిదారులు పాల్గొన్నారు.

# దళిత రైతులతో కిచ్చెన్న భేటీ

**-రెవెన్యూ అధికారులతో మాట్లాడిన కాంగ్రెస్ నేత**

**-ప్రభుత్వం దృష్టికి భూ సమస్యను తీసుకెళ్తా: కేఎల్ఆర్**



మహేశ్వరం,జూన్ 14 (నీలగిరి ఎక్స్ ప్రెస్)

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండలం తుక్కుగూడ కార్యాలయంలో..కొంగరకుర్ధు దళిత రైతుల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. తుక్కుగూడ కార్యాలయంలో కలిసి తమ గోడును కిచ్చెన్నకు వివరించారు.సర్వేనంబర్ 73లో 43ఎకరాల ప్రభుత్వ భూమిని దళితులు 7దశాబ్దాలుగా సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే 2009లో హౌసింగ్ బోర్డుకు ఈ భూమిని కేటాయించారని ఇటీవల అధికారులు స్వాధీనం చేసుకునేందుకు రావటంతో రైతులు అవాక్కైయ్యారు.ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా.. తమకు ఇచ్చే పరిహారం చెప్పకుండా భూమిని తీసుకోవద్దంటూ కేఎల్ఆర్ కు రైతులు, మహిళలు విజ్ఞప్తి చేశారు.కొంతమంది ప్రైవేటు వ్యక్తులు తప్పుడు సర్వేనంబర్ తో అగ్రిమెంట్లు చేసుకోవటం జరిగిందని తమకు సంబంధం లేదని లక్ష్మారెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమస్యపై వెంటనే ఆర్డీవోతో మాట్లాడి... అన్ని వివరాలు తెలుసుకున్నారు కిచ్చెన్న.

కొంగరకుర్ధు రైతుల సమస్యను ప్రభుత్వం, రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని కేఎల్ఆర్ హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో రావిర్యాల కాంగ్రెస్ నాయకులు సహా రైతులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

# గుడ్ మార్నింగ్ మణికొండ కార్యక్రమంలో మాజీ మంత్రి

**-గుడ్ మార్నింగ్ మణికొండ వందరోజుల సెలబ్రేషన్ కార్యక్రమంలో పాల్గొన్న సబితా ఇంద్రారెడ్డి, పట్లోళ్ల కార్తీక్ రెడ్డి**




రాజేంద్రనగర్,జూన్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)


రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధి మణికొండ మున్సిపాలిటీ సెలబ్రేషన్ ఫంక్షన్ హాల్, అల్కాపురి టౌన్ షిప్ లో జరిగిన గుడ్ మార్నింగ్ మణికొండ వందరోజుల సెలబ్రేషన్ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గం శాసనసభ్యురాలు సబితా ఇంద్రా రెడ్డి, మరియు రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇన్చార్జి పట్లోళ్ల కార్తీక్ రెడ్డి.

ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా విచ్చేసిన నాయకులకు గుడ్ మార్నింగ్ మణికొండ ప్రోగ్రామ్ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం తో పూలమాలతో ఘనంగా సన్మానించడం జరిగినది. ఈ సందర్భంగా సబితాఇంద్రారెడ్డి మాట్లాడుతూ... ఇది చాలా మంచి కార్యక్రమము, ఇలాంటి కార్యక్రమాలు నిరంతర కొనసాగిస్తూ ప్రజలకు చేరువుగా ఉండాలని అన్నారు. అదేవిధంగా కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి మంచి మంచి కార్యక్రమాలు చేపడుతూ రాజేంద్రనగర్ ప్రజల పక్షాన నిలబడదామని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ

**-699 లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీలు**

**-భూమిపూజలు నిర్వహించిన మంత్రి లక్ష్మణ్ కుమార్**




ధర్మపురి, జూన్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)

ధర్మపురి పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ లబ్ధిదారులకు 699 ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ధర్మపురి మండలం ధమ్మన్నపేట గ్రామానికి చెందిన జక్కు రమేష్, అలాగే పట్టణంలోని లక్ష్మీ నరసింహ కాలనిలోని శ్యాంరావు కుమార్ గారికి మంజూరైన ఇళ్ల స్థలాల్లో భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, "ప్రతి పేద కుటుంబానికి సొంత ఇంటి కలను నిజం చేయాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని వేగంగా అమలు చేస్తోంది. ఇప్పటికే నియోజకవర్గంలోని ప్రతి మండలంలో ఒక్కో గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంచుకొని ఇంటి నిర్మాణాలు ప్రారంభించాం. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్దేశిత స్క్వేర్ ఫీటేజీలో ఇంటి నిర్మాణం చేపట్టాలని సూచించాం. అధికారులు పరిశీలించి లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా నగదు జమ చేస్తున్నారు. ఇంకా అర్హత ఉన్నా ఇల్లు మంజూరు కానివారైతే నన్ను నేరుగా సంప్రదించవచ్చు" అని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్, మండల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కోటింత ప్రజలు పాల్గొన్నారు. ప్రజలు మంత్రి వ్యాఖ్యలకు విశేష స్పందన వ్యక్తం చేశారు.

# రాహుల్ గాంధీ పై అనుచిత వ్యాఖ్యలు సరికాదు




అచ్చంపేట,జూన్ 14( నీలగిరి ఎక్స్‌ప్రెస్)

అస్సాం సీఎం హేమంత్ బిశ్వశర్మ, కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ పట్ల చేసిన వాక్యాలు వెనక్కి తీసుకోవాలని మరియు క్షమాపణ చెప్పాలని అచ్చంపేట యూత్ కాంగ్రెస్ లీగల్ సెల్ చైర్మన్ శత్రువు నాయక్ డిమాండ్ చేశారు. శనివారము అచ్చంపేట పోలీస్ స్టేషన్లో ఆయన ఫిర్యాదు చేయడం జరిగింది. అస్సాం సీఎం బిజెపి నాయకులపై కేసు నమోదు చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కుంద మల్లికార్జున్, అచ్చంపేట ఎస్సీ సెల్ తాలూకు అధ్యక్షుడు చింతల రాజగోపాల్, గౌరీ శంకర్, పవన్ వెంకట్ ఖాదర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యమైన విద్యతోనే విద్యార్థులకు బంగారు భవిష్యత్తు

## – ఎంపీ రఘునందన్ రావు




తుక్కుగూడ,జూన్ 14 (నీలగిరి ఎక్స్ ప్రెస్) మహేశ్వరం నియోజకవర్గం తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని తుక్కుగూడ టౌన్ లో నూతనంగా ఏర్పాటుచేసిన శ్లోక ఇంటర్నేషనల్ స్కూల్ ప్రారంభోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథులుగా మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మహేశ్వరం నియోజకవర్గ బిజెపి ఇన్చార్జ్ అందెల శ్రీరాములు హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్లోక యాజమాన్యం ముఖ్య అతిథులను ఘనంగా స్వాగతించి సత్కరించారు. అనంతరం రఘునందన్ రావు మాట్లాడుతూ విద్యారంగం ద్వారా సమాజాభివృద్ధి సాధ్యమని పిల్లలకు మంచి భవిష్యత్తు కల్పించాలంటే నాణ్యమైన విద్య అవసరమని శ్లోక ఇంటర్నేషనల్ స్కూల్ ఈ లక్ష్యానికి దోహద పడుతుంది అని తెలిపారు. శ్రీరాములు మాట్లాడుతూ.. మహేశ్వరం నియోజకవర్గానికి ఒక ప్రమాణిక విద్యాసంస్థగా శ్లోక స్కూల్ ఎదగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని.. ఈ సందర్భంగా శ్లోక విద్యాసంస్థల యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తుక్కుగూడ మున్సిపాలిటీ మాజీ చైర్మన్ మరియు బిజెపి అధ్యక్షురాలు బరిగెల హేమలత రాజు గౌడ్, మాజీ కౌన్సిలర్లు శివకుమార్ గౌడ్, జాపాల సుధాకర్, రాజామౌని రాజు ముదిరాజ్, శివయ్య గౌడ్, బోధ యాదగిరి రెడ్డి, ఓబిసి మూర్చ రాష్ట్ర నాయకులు నీటు శ్రీశైలం గౌడ్, మాజీ ప్రధాన కార్యదర్శి కృష్ణ గౌడ్, జిల్లా దిశ కమిటీ సభ్యులు అంబోజి శ్రీనివాస్, బిజెపి సీనియర్ నాయకులు బాలరాజ్, రవి నాయక్, దేవేందర్ నాయక్ మరియు బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు.

# చెట్టు = అమ్మ, చెత్త = రోగం

చెట్టు మన జీవితానికి అమ్మంత ప్రాముఖ్యమైనది. అది మనకు ప్రాణవాయువును అందిస్తుంది, ప్రకృతిని సంరక్షిస్తుంది, మన శ్రేయస్సుకు తోడ్పడుతుంది. చెట్టు ఉంటే జీవితం ఉందని చెప్పడం అసత్యం కాదు. మరోవైపు, చెత్త అనేది రోగాలకు కారణమవుతుంది. చెత్త ఎక్కడైతే పేరుకుపోతుందో అక్కడ పర్యావరణం కలుషితమవుతుంది, నీరు, గాలి, నేల నాశనం అవుతాయి.

**చెట్టు ఎలా అమ్మలా ఉంటుంది:**

-మనకు ఆక్సిజన్ అందిస్తుంది.

-నీడ, చల్లదనం, ఆహారం, చెక్క, ఔషధాలు అందిస్తుంది.

-ప్రకృతి మనుగడలో కీలక పాత్ర పోషిస్తుంది.

**చెత్త ఎలా రోగంగా మారుతుంది:**

-చెత్త పేరుకుపోతే దోమలు, చీమలు, బ్యాక్టీరియా పుట్టుక.

-కాలుష్యం వల్ల శ్వాసకోశ, నీరు మరియు ఆహారానికి సంబంధించిన రోగాలు.

చెట్టు మన జీవితానికి అమ్మవంటిది. అందుకే మనం చెట్లను నాటాలి, వాటిని కాపాడాలి.

చెత్త మన జీవనానికి రోగం. అందుకే చెత్తను తగ్గించాలి, పునర్వినియోగం చేయాలి, పర్యావరణాన్ని స్వచ్ఛంగా ఉంచాలి.

"ప్రకృతిని ప్రేమిద్దాం, జీవనాన్ని కాపాడుకుందాం!"

మీ నరేష్ దండు సామాజిక కార్యకర్త

# ప్రపంచానికి భారత్ నాయకత్వం వహించే స్థాయికి వస్తుంది.: కెఎల్ఆర్

-సామాజిక న్యాయంగా పేద విద్యార్థులకు సైతం కార్పొరేట్ విద్య అందించాలి

-తుక్కుగూడ శ్లోకా స్కూల్ ప్రారంభోత్సవంలో కిచ్చెన్న



మహేశ్వరం,జూన్ 14 (నిలగిరి ఎక్స్ ప్రెస్) రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండలం తుక్కుగూడ మున్సిపాలిటీలో కేఎల్ఆర్ మాట్లాడుతూ....కార్పొరేట్ విద్యసంస్థల్లోనూ సామాజిక న్యాయం పాటించి పేద పిల్లలకు సైతం ఉచితంగా చదువు చెప్పాలని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి కోరారు.తుక్కుగూడ పట్టణంలో శ్లోకా ఇంటర్నేషనల్ స్కూల్ ప్రారంభోత్సవంలో శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డితో కలిసి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేఎల్ఆర్ మాట్లాడుతూ... విద్యార్థి దశ నుంచే గొప్పవ్యక్తులుగా మారేందుకు కలలు కని వాటిని సాకారం చేసుకోవాలని సూచించారు. ఏపీజే అబ్దుల్ కలాం స్ఫూర్తితో మంచి ధృక్పథంతో ముందుకు సాగాలని నెగిటివ్ ఆలోచనలు చేయకుండా పాజిటివ్ థింకింగ్ చేయాలని కోరారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సైతం పిల్లలకు నువ్వు ఏదైనా సాధించగలవన్న ధైర్యం ఇవ్వాలని కేఎల్ఆర్ తెలిపారు.గొప్ప భారతదేశంగా మారి ప్రపంచానికి నాయకత్వం వహించే స్థాయికి మన విద్యార్థులు రావాలని కిచ్చెన్న ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

# బ్లడ్ డోనర్ దినోత్సవం సందర్భంగా... సొసైటీ ప్రిన్సిపల్ మహమ్మద్ ఖుర్షీద్ రక్త దానం...

అభినందించిన గవర్నర్ క్యాంప్ కార్యాలయం,ఎస్ వి కాలేజీ పూర్వ విద్యార్థులు...




హైదరాబాద్, జూన్ 14(నీలగిరి ఎక్స్‌ప్రెస్) బ్లడ్ డోనర్ దినోత్సవం సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో గవర్నర్ క్యాంప్ ఆఫీసులో రక్తదాన శిబిరం జరిగింది. తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ కొందుర్గ్ ప్రిన్సిపల్ ఖుర్షీద్ రక్తదాన శిబిరంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఖుర్షీద్ కు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తెలంగాణ స్టేట్ బ్యాంక్ ప్రెసిడెంట్ అయినటువంటి గవర్నర్ ఆమోదముద్ర పొందిన ప్రశంసా పత్రాన్ని అందజేయడం విశేషం.... ఇదిలా ఉండగా గత సంవత్సరం ఇదే 14.06.2024 రోజు న కూడా ఖుర్షీద్ రక్తదాన శిబిరంలో పాల్గొన్న విశేషం. అంతే కాకుండా గతంలో కూడా పలు మార్లు రక్త దానం చేశారు. ఈ సందర్భంగా ఎస్ వి కళాశాల పూర్వ విద్యార్థులు, కొందుర్గ్ అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

# నేడు వలిగొండ పట్టణంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

జూన్ 14(నీలగిరి ఎక్స్‌ప్రెస్) వలిగొండ (ప్రతినిధి) నేడు వలిగొండ పట్టణ కేంద్రంలో విద్యుత్ లైన్ల క్రమబద్ధీకరణ కారణంగా ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు మండల విద్యుత్ శాఖ ఏఈ జే. నరసింహ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు విద్యుత్ లైన్ ల క్రమబద్ధీకరణలో భాగంగా ఏర్పడే విద్యుత్ అంతరాయాన్ని పట్టణ వినియోగదారులు గమనించి విద్యుత్ శాఖ అధికారులతో వినియోగదారులు సహకరించాలని కోరారు

# టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ను సన్మానించిన ఎస్సీ సెల్ అధ్యక్షులు రాజగోపాల్



అచ్చంపేట,జూన్ 14( నీలగిరి ఎక్స్‌ప్రెస్) అచ్చంపేట పట్టణ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ గా నియమించిన సందర్భంగా అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ని సన్మానించిన తాలూకా ఎస్సీ సెల్ అధ్యక్షులు చింతల రాజగోపాల్,తుర్ప టి ముత్యాలు, పొలిమేర రాజు, తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పల చారిస్టబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గర్భిణీ స్త్రీలకు మెడికల్ కిట్లు పంపిణీ



కల్వకుర్తి,జూన్ 14( నీలగిరి ఎక్స్‌ప్రెస్) కల్వకుర్తి మండల పరిధిలోని కు రుమిద్ద గ్రామ తండా లో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మరియు తెలంగాణ మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఉప్పల వెంకటేష్ సహకారంతో గ్రామంలోని గర్భిణీ స్త్రీలకు మెడికల్ కిట్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు హనుమంతు నాయక్, రాము నాయక్, లక్ష్మణ్ నాయక్, పులియ నాయక్, సేవ్య నాయక్, శక్రు నాయక్, కమలమ్మ, శాంతి, సరోజ, శోభ,ఆశ వర్కర్లు గ్రామ పెద్దలు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# తప్పుడు కథనాలు సోషల్ మీడియాలో ప్రచారం చేస్తే కఠిన చర్యలు

సిఐ విష్ణువర్ధన్ రెడ్డి



వెల్దండ,జూన్ 14(నీలగిరి ఎక్స్‌ప్రెస్) వెల్దండ మండల పరిధిలోని పోతే పల్లి గ్రామంలో ఇద్దరు వ్యక్తుల మధ్య గొడవ జరగగా,అట్టి విషయమై బాధితుడు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేయబడింది. అదేవిధంగా ఇట్టి గొడవకు సంబంధించిన ఒక వీడియోను కొంతమంది వ్యక్తులు ఇందిరమ్మ ఇండ్ల కోసం కొట్టుకున్నట్టు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అంటూ వాట్సాప్ గ్రూపులో తప్పుడు ప్రచారం చేశారు. తప్పుడు ప్రచారాలు చేస్తున్న వ్యక్తులపైన వెల్దండ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేయబడింది. అదేవిధంగా ఎలాంటి ఆధారాలు లేకుండా తప్పుడు వార్తలను ప్రచారం చేసిన లేదా వాట్సాప్ గ్రూప్ లో ఫార్వర్డ్ చేసిన వ్యక్తులపైన చట్టపరమైన చర్యల తీసుకుంటామని విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు.

# ఎంపీ వద్దిరాజు,మాజీ మంత్రులు తన్నీరు, సింగిరెడ్డి తదితర ప్రముఖులతో తెలంగాణ భవన్ లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్...



హైదరాబాద్, జూన్ 14(నీలగిరి ఎక్స్ ప్రెస్): ఆంధ్రప్రదేశ్ జల దోపిడీ కుట్రలపై మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు హైదరాబాద్ తెలంగాణ భవన్ లో శనివారం సాయంత్రం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు."బనకచర్ల ప్రాజెక్ట్ పేరుతో ఆంధ్రప్రదేశ్ చేస్తున్న జల దోపిడీ కుట్రలు "అనే అంశంపై ఆర్థిక, సాగునీటి పారుదల, వైద్యారోగ్య శాఖల మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ దాసోజు శ్రవణ్ కుమార్, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేష్, చింత ప్రభాకర్, డాక్టర్ కల్వకుంట్ల సంజయ్,పాడి కౌశిక్ రెడ్డి తదితర ప్రముఖులు హాజరయ్యారు. అలాగే, ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ రావుల చంద్రశేఖరరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్ రెడ్డి,చంటి క్రాంతికిరణ్, డాక్టర్ మెతుకు ఆనంద్, గొంగిడి సునీత, బీఆర్ఎస్ నాయకులు వీ.దేవీప్రసాద్ రావు, ఎర్రోళ్ల శ్రీనివాస్,తుల ఉమ,చిరుమల్ల రాకేష్,కోతి కిశోర్ గౌడ్, ఉపేంద్రాచారి,గెల్లు శ్రీనివాస్ యాదవ్,వై.సతీష్ రెడ్డి, సోమ భరత్ కుమార్, గోసుల శ్రీనివాస్ యాదవ్, ధర్మేందర్ రెడ్డి, మన్నె గోవర్ధన్ రెడ్డి తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

# టిపిసిసి ఉపాధ్యక్షులు వంశీకృష్ణను సన్మానించిన కాయితి విజయకుమార్ రెడ్డి



అచ్చంపేట,జూన్ 14(నీలగిరి ఎక్స్‌ప్రెస్) అచ్చంపేట పట్టణ కేంద్రంలోని తెలంగాణ కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మరియు నాగర్ కర్నూల్ పార్లమెంటు సభ్యులు డాక్టర్ మల్లు రవి మరియు కల్వకుర్తి కాంగ్రెస్ పార్టీ బ్లాక్ అధ్యక్షులు మర్యాదపూర్వకంగా కలిసి టిపిసిసి ఉపాధ్యక్షులు నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షులు మరియు అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ని,కల్వకుర్తి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కాయితి విజయకుమార్ రెడ్డి శాలువాతో ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మానేరు రివర్ ఫ్రంట్ అవినీతి పై విజిలెన్స్ విచారణ చేపట్టాలి.

-జిల్లా ఇంచార్జీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మానేరు రివర్ ఫ్రంట్,కేబుల్ బ్రిడ్జి పనుల అభివృద్ధి పై అధికారులతో సమీక్ష చేయాలి.

- సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు,మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి డిమాండ్.



**కరీంనగర్, జూన్ 14(నీలగిరి ఎక్స్ ప్రెస్)**

కరీంనగర్ జిల్లా ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం సృష్టించడానికి పర్యాటక రంగ అభివృద్ధి కోసం గత బిఆర్ఎస్ ప్రభుత్వం అట్టహాసంగా చేపట్టిన మానేరు రివర్ ఫ్రంట్, తీగల వంతెన నిర్మాణ పనుల్లో పూర్తిగా అవినీతి,అక్రమాలు చోటు చేసుకున్నాయని,తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకొని విజిలెన్స్ ద్వారా సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు,మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం రోజున సిపిఐ కరీంనగర్ నగర సమితి ఆధ్వర్యంలో కరీంనగర్ లోని మానేరు ఫ్రంట్,తీగల వంతెన ను సిపిఐ బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయంలో మానేరు రివర్ ఫ్రంట్ నిర్మాణం కోసం 500 కోట్ల నిధులు మంజూరు చేయగా అందులో 100 కోట్లు టూరిజం శాఖ, 100 కోట్లు నీటి పారుదల శాఖ నిధులు మంజూరు చేసిందని, పర్యాటక రంగ అభివృద్ధి కోసం చేపట్టిన పనులు మధ్యలో ఆగిపోయాయని ఆరోపించారు.

గత ప్రభుత్వ హయాంలో కరీంనగర్ కు చెందిన శాసనసభ్యులు ఆనాటి బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ నేతృత్వంలో జరిగిన ఈ పనులు పూర్తిగా అవినీతి మయమై లోపభూయిష్టంగా జరిగాయని, తన అనుచరులైన వారిని,వారి కుటుంబానికి చెందిన వారిని కాంట్రాక్టర్ల గా, బినామీలుగా ఉపయోగించుకొని పనుల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించకుండా పనులను అసంపూర్తిగా చేశారన్నారు. అప్పటి పురపాలక శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు ఆగమేఘాల మీద కరీంనగర్ కు వచ్చి మానేరు రివర్ ఫ్రంట్ పనులను ప్రారంభించారని, కానీ నేటికీ పనులకు అతిగతి లేదన్నారు. రివర్ ఫ్రంట్ ప్రాంతంలో నిర్మించిన చెక్ డ్యాములు పూర్తిగా నాణ్యత లోపం తో నిర్మించడం వల్ల వర్షాలకు ఎక్కడికక్కడ చెక్ డ్యాములు కొట్టుకుపోయాయని, నిర్మాణ లోపాలు ఉన్నటువంటి మానే రివర్ ఫ్రంట్ కు రెండు వందల కోట్ల రూపాయల నిధులను ఏ ప్రాతిపదికన విడుదల చేశారో నేటి ప్రభుత్వం స్పష్టం చేయాలని, నిర్మాణ పనుల్లో జరిగిన అవినీతిపై కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే విజిలెన్స్ విచారణ చేపట్టాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని వెంకటరెడ్డి తెలిపారు. తీగల వంతెన ను ఆనాటి రోడ్లు భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హడావుడిగా ప్రారంభించారని, 208 కోట్ల నిధులు వెచ్చించి కనీసం విద్యుత్ దీపాలు, రోడ్లు సరిగా వేయకపోవడం, వేసిన వీధి దీపాలు వెలగకపోవడం దారుణమని,నాడు ప్రారంభించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నేడు కాంగ్రెస్ ప్రభుత్వంలో జిల్లా ఇంచార్జీ మంత్రిగా నియామకమైనందున తక్షణమే జిల్లా అధికారులతో కేబుల్ బ్రిడ్జి మానేరు ఫ్రంట్ పై సమీక్ష సమావేశం జరిపి అవినీతి అక్రమాలకు పాల్పడి నాణ్యత ప్రమాణాలు పాటించని కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. అవినీతి ఎక్కడ జరిగితే అక్కడ సిపిఐ ప్రత్యక్షమవుతుందని అవినీతి అంతమే సిపిఐ పంతమని,ప్రభుత్వం వెంటనే సమగ్ర విచారణ చేపట్టకుంటే సిపిఐ చూస్తూ ఊరుకోదని ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని చాడ వెంకటరెడ్డి హెచ్చరించారు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మర్రి వెంకటస్వామి మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ ప్రాజెక్టు లో 200 కోట్ల ప్రజాధనాన్ని మొక్కుబడిగా ఖర్చు చేసి నీటిపాలు చేసిందని, ప్రజాధనాన్ని సంక్షేమం కోసం కాకుండా కాంట్రాక్టర్ లబ్ధి కోసం అప్పగించిన నాటి ప్రభుత్వంలో మంత్రి గంగుల కమలాకర్ కోట్లాది రూపాయల నిధులను దుర్వినియోగం చేశాడని విమర్శించారు. ఏ మేరకు అభివృద్ధి పనులు జరిగాయని,ఎంత అవినీతి జరిగిందని,ఎందుకు పనులు నిలిచిపోయాయి అనే విషయాలపై నిష్పక్షపాతంగా కాంగ్రెస్ ప్రభుత్వం తగిన విచారణ చేపట్టి బాధ్యులైన కాంట్రాక్టర్లపై క్రిమినల్ కేసు నమోదు చేసి ప్రజాధనాన్ని రికవరీ చేయాలని అవినీతి పై సిపిఐ పోరాటం చేస్తుందని మర్రి వెంకటస్వామి తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యురాలు కిన్నెర మల్లవ్వ, జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు,న్యాలపట్ల రాజు,కటికరెడ్డి బుచ్చన్న యాదవ్,కసిరెడ్డి మణికంఠ రెడ్డి,బండ రాజిరెడ్డి,కంది రవీందర్ రెడ్డి,మచ్చ రమేష్, బ్రామండ్లపల్లి యుగేందర్, నాయకులు గామినేని సత్తయ్య,నగునూరి రమేష్, కూన రవి, చెంచల మురళి, మామిడిపల్లి హేమంత్ కుమార్,సందీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్స్ దిల్‌సుఖ్‌నగర్ బ్రాంచ్ లో ఘనంగా ఫాదర్స్ డే...






**దిల్ సుఖ్ నగర్, జూన్ 14(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్స్, దిల్‌సుఖ్‌నగర్ బ్రాంచ్ లో ఫాదర్స్ డేని ఎంతో ఉత్సాహంగా, ఆనందంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో అనేక మంది తండ్రులు, తాతల భాగస్వామ్యం మెరుగైన మధుర జ్ఞాపకాలను విద్యార్థులు, తల్లిదండ్రులకు అందించింది. ఈ కార్యక్రమానికి అతిథులుగా పర్యావరణ పరిరక్షణ శాఖ చైర్మన్ రంగయ్య, లోటస్ ల్యాప్ డైరెక్టర్ శ్రీమతి కోమట్ రెడ్డి మంజుల రాణి, కోమటి రెడ్డి అభిషేక్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ మాధవి సంగీ మేడం, ఇన్‌చార్జ్ జ్యోతి బజాజ్ మేడం, నందిని మేడం, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ స్వాతి రెడ్డి మేడం, ఉపాధ్యాయ వర్గం, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్స్ చైర్మన్ మరియు టిఆర్ఎస్ ఎంఎ జాతీయ సలహాదారు, ప్రఖ్యాత విద్యావేత్త మరియు పర్యావరణవేత్త డా.లయన్ కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి హాజరై, స్ఫూర్తిదాయకమైన సందేశం అందించారు.ఒక తండ్రి పాత్ర కుటుంబ అభివృద్ధిలో అపారమైనది. కుటుంబ భవిష్యత్తు కోసం తన సౌకర్యాలను త్యాగం చేస్తాడు. పిల్లలు తమ తండ్రికి గౌరవం, కృతజ్ఞతతో బరించాలి. తండ్రులు తమ పిల్లలకు మంచి విద్యను అందించి వారికి ఉత్తమ భవిష్యత్తు కోసం ప్రోత్సాహమివ్వాలి. అదే నిజమైన ప్రేమ యొక్క వారసత్వం. ”ఈ సందర్భంగా విద్యార్థుల ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు, తండ్రుల కోసం ప్రత్యేకంగా నిర్వహించిన ఆటలు, పోటీలు ఆకట్టుకున్నాయి. విజేతలకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమానికి హాజరైన ప్రతి ఒక్కరు, ప్రత్యేకంగా లోటస్ ల్యాప్ చైర్మన్ డా.కోమటిరెడ్డి గోపాల్ రెడ్డికి మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియజేశారు. కుటుంబ విలువలు, సాంస్కృతిక సాంప్రదాయాలు, విద్య యొక్క ప్రాధాన్యతను సమాజానికి తెలియజేసే ఈ వేడుక, ప్రతి ఒక్కరి మనసును గెలుచుకుంది. ఈ ఫాదర్స్ డే వేడుక కుటుంబం మరియు పాఠశాల మధ్య బంధాన్ని మరింత బలపరిచింది. ప్రేమ, బాధ్యత మరియు కట్టుబాటు అనే సందేశాన్ని సమాజానికి స్పష్టంగా తెలియజేసింది.

# లోక్ అదాలత్ ల ద్వారా కేసుల సత్వర పరిష్కారం.

- జిల్లా జడ్జి శివకుమార్ .




**కరీంనగర్, జూన్ 14 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**

: జాతీయ,రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాలానుసారం ఈ లోక్ అదాలతులను నిర్వహిస్తున్నట్లు, వీటి ద్వారా కేసుల సత్వర పరిష్కారం జరుగుతుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్ పర్సన్, జిల్లా జడ్జి ఎస్ శివకుమార్ తెలిపారు.జిల్లా కోర్టు ఆవరణలో శనివారం జాతీయ లోకదాలత్ ప్రారంభ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. రాజీ ఏ రాజమార్గంగా ఈ లోకదాలతులను ఏర్పాటు చేయడం జరిగిందని, దీని ద్వారా ఇరుపార్టీల వారు రాజీ అయి వారిపై కేసులు తొలగించుకోవచ్చని తెలిపారు. లోకదా లతులలో కేసులు పరిష్కరించుకుంటే వాటికి అప్పీలు ఉండదని, కోర్టుల్లో కేసుల సంఖ్య పేరుకుపోయి ఉందని కేసుల పెండెన్సీ తగ్గించేందుకు లోకదాలతులే సరి అయిన మార్గమని తెలిపారు. ఈ లోకదాలత్ లను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని, దీనిలో ఎక్కువ సంఖ్యలో కేసులు పరిష్కరించుకొని రాష్ట్రంలో జిల్లాకు గుర్తింపు తీసుకురావాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. అడిషనల్ డీసీపీ వెంకటరమణ మాట్లాడుతూ రాజీ ద్వారా కేసుల సత్వర పరిష్కారానికి లోకదాలత్ లు సరైన మార్గం అని, క్రిమినల్ కేసుల పరిష్కారానికి తమ పోలీస్ సిబ్బంది పూర్తి సహకారం అందించనున్నట్లు ఆయన తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు లింగంపల్లి నాగరాజు మాట్లాడుతూ లోకదాలత్ లపై ప్రజల్లో అవగాహన పెరిగిందని, వీటిలో కేసుల పరిష్కారాల సంఖ్య చూస్తే తెలుస్తుందని, రాజీ ద్వారా సత్వర న్యాయం పొందేందుకు లోకదాలత్ లే ఏకైక మార్గం అని తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వెంకటేష్ మాట్లాడుతూ లోకదాలత్ లలో ఎక్కువ సంఖ్యలో కేసులు పరిష్కరించుకునేందుకు అందరి సహకారం లభిస్తున్నదని తెలుపుతూ లోకదాలత్ ల గూర్చి అయన వివరించారు. అనంతరం జాతీయ లోకదాలత్ ను ప్రారంభిస్తూ జిల్లా జడ్జి మోటారు ప్రమాద సంఘటన కేసు లోకదాలత్ లో పరిష్కారం కాగా ఆ మరణించిన వ్యక్తి కుటుంబానికి కోటి రూపాయల పరిహారం చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు,పోలీస్ అధికారులు,ఇన్సూరెన్స్, బ్యాంక్, ఆర్టీసీ ప్రతినిధులు, న్యాయవాదులు, కక్ష దారులు పాల్గొన్నారు.

# ఆపదలో ఉన్న కుటుంబానికి మంత్రి అడ్లూరి ఆర్థికసాయం



**ధర్మపురి, జూన్ 14(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

ధర్మపురి పట్టణంలోని నంది చౌకు వద్ద సంవత్సరాలుగా టిఫిన్ సెంటర్ బండి నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్న గోపి, గత కొన్ని నెలలుగా ఆరోగ్య సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఆయన పరిస్థితిని ధర్మపురి కాంగ్రెస్ నాయకులు ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన మంత్రి, గోపి కుటుంబానికి పదివేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సహాయాన్ని స్థానిక నాయకుల చేతుల మీదుగా అందజేయడం జరిగింది.

# విద్యుత్ సందందిత అంశాలపై అవగాహన కోసమే సెమినార్లు...

ఎలక్ట్రీషన్లకు సర్టిఫికెట్ల ప్రధానం...






**కరీంనగర్, జూన్ 14(నీలగిరి ఎక్స్ ప్రెస్)**

ఎలక్ట్రిషన్ల కోసం సెమినార్లు సాధారణంగా విద్యుత్ సంబంధిత అంశాలపై అవగాహన కల్పించడానికి, నైపుణ్యాలను మెరుగుపరించడానికి , వృత్తిపరమైన అభివృద్ధికి, కొత్త సాంకేతిక పరిజ్ఞానాల గురించి తెలుసుకోవడానికి సహాయపడతాయని బిజెపి అసెంబ్లీ కన్వీనర్ దుబాల శ్రీనివాస్, సివిల్ ఇంజనీర్, లైన్స్ క్లబ్ డైరెక్టర్ కోలా అన్నారెడ్డి, బుర్ర మధుసూదన్ రెడ్డి, రౌదండి వెంకటేష్ అన్నారు. ఇంటర్నేషనల్ కాపర్ అసోసియేషన్ ఇండియా, కే. కే ఆర్ ఫౌండేషన్ బాధ్యులు, మాజీ రిటైర్డ్ ఆఫీసర్ డా. కే. కృష్ణారెడ్డి , శ్రీ ఆంజనేయ సేవా సమితి భజన మండలి అధ్యక్షులు కొండమీది తిరుపతి స్వామి ఆధ్వర్యంలో ఎలక్ట్రికల్ టెక్నికల్ సెమినార్ జరిగింది . ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ ఎలక్ట్రిషన్ల కు సెమినార్లతో అనేక ప్రయోజనాలు ఉంటాయన్నారు. ప్రధానంగా నైపుణ్యల పెరుగుదల, వృత్తిపరమైన అభివృద్ధి, నెట్వర్కింగ్ , కొత్త సాంకేతిక పరిజ్ఞానాల గురించి ఎలక్ట్రిషన్లు అనేక విషయాలు తెలుసుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు పలువురు ఎలక్ట్రిషన్లకు సర్టిఫికెట్ల ప్రధానం చేశారు. ఇట్టి కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు సుద్దాల మహేందర్, జాడి రాజు, బత్తిని తిరపతి గౌడ్, చిరంజీవి, కళాధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అల్ఫోర్స్ ఉమెన్ డిగ్రీ కళాశాలలో పట్టాల ప్రధానోత్సవం




**కరీంనగర్, జూన్ 14(నీలగిరి ఎక్స్ ప్రెస్)**

: కరీంనగర్ జిల్లా వావిలాలపల్లిలోని ఒక ప్రైవేట్ వేడుక మందిరంలో అల్ఫోర్స్ మహిళా డిగ్రీ కళాశాల “గ్రాడ్ గాల” (పట్టాల ప్రధానోత్సవం) ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత, విఎన్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ వి. నరేందర్ రెడ్డి, శాతవాహన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఉమేష్ కుమార్, కళాశాల కరస్పాండెంట్ వి. రవీందర్ రెడ్డి గౌరవ అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు అద్భుతమైన కమ్యూనికేషన్ స్కిల్స్ మరియు వివిధ విషయాలపై విస్తృత అవగాహన కలిగి ఉండాలని, తద్వారా వారికి పుష్కలమైన అవకాశాలు లభిస్తాయని తెలిపారు. విద్యార్థులు తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా శ్రమించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# వాసవి క్లబ్ ఆధ్వర్యంలో గరుకు స్తంభాల ఏర్పాటు





**కరీంనగర్, జూన్ 14(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
వాసవి క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక గుండ్లపల్లి వద్దగల డాక్టర్ రాజ భాస్కర్ రెడ్డి గోశాలలో ఈరోజు గరుకు స్తంభాలను ఏర్పాటు చేశారు. గోశాల లో జరిగిన ఈ కార్యక్రమంలో వనిత క్లబ్ అధ్యక్షురాలు జిల్లా రజిత, కపుల్స్ క్లబ్ అధ్యక్షుడు జిల్లా జగదీష్ మరియు వాగ్దేవి వనితా క్లబ్ ఆధ్వర్యంలో,చందా రవీందర్ విజయలక్ష్మి ,చందా వీరేశం పద్మ , గార్ల సహకారం తో మూడు గరుకు స్తంభాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వాసవి క్లబ్ జిల్లా గవర్నర్ ఇల్లందుల కిషోర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోవులు దురద పెట్టినప్పుడు ఈ గరుకు స్తంభాలకు గోక్కోవడం వల్ల మనం గోమాతలకు పుణ్యం చేసినట్టు అవుతుందని అన్నారు. గోమాత సకల దేవతల సమాహారమని గోమాతను పూజిస్తే అత్యంత పుణ్యం లభిస్తుందని అన్నారు ఈ సందర్భంగా మూడు కలిపి స్తంభాలను ఏర్పాటు చేసిన క్లబ్బులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్యాబినెట్ సెక్రటరీ జైనా అర్చన, రీజినల్ చైర్ పర్సన్ పాత రాధా కిషన్, జోనల్ చైర్పర్సన్ మాడిశెట్టి ఉమాదేవి, సుర గీత, గాయత్రి, ప్రదీప్ , తిరుపతి, పబ్బా అరుణ, వాగ్దేవి క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు రూప శ్రీ, రాజమణి ట్రెజరర్ హరిణి , మాడిశెట్టి గోపాల్,వనితా క్లబ్ కోశాధికారి కౌసల్య, పూజారులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ చైతన్య పాఠశాలల వ్యాపార విధానంపై ఏఐఎస్ఎఫ్ నిరసన




**తిమ్మాపూర్, జూన్ 14(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండల కేంద్రంలోని శ్రీ చైతన్య పాఠశాల వారు నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు అమ్మడాన్ని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పాఠశాల స్టోర్ ముందు ధర్నా నిర్వహించి, స్టోర్‌ను సీజ్ చేశారు. విద్యా సంస్థలు విజ్ఞాన కేంద్రాలుగా ఉండాల్సిన అవసరం ఉందని, వ్యాపార కేంద్రాలుగా మారడం విద్యార్థులకు తీవ్ర అన్యాయం చేస్తుందని ఏఐఎస్ఎఫ్ నేతలు పేర్కొన్నారు. పాఠశాలలు విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే చోటుగా ఉండాలని, వ్యాపార ప్రయోజనాల కోసం నిబంధనలను ఉల్లంఘించడం అనాగరిక చర్య అని ఏఐఎస్ఎఫ్ నేతలు అభిప్రాయపడ్డారు.

# ప్రయాణికులుకు ఇండిగో సంస్థ కీలక ప్రకటన



**హైదరాబాద్ జూన్ 14(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పశ్చిమాసియాలో ఇజ్రాయెల్, ఇరాన్ దేశాల మధ్య వార్ నడుస్తున్న విషయం తెలిసిందే. ఇరుదేశాలు పరస్పరం వైమానిక దాడులు చేసుకున్నాయి. ఈ దాడుల్లో ఇరాన్ టాప్ కమాండర్లను, పలువురు శాస్త్రవేత్తలను కోల్పోయింది. ఈక్రమంలో తాజాగా ఇండిగో విమాన సర్వీసు సంస్థ సోషల్ మీడియా ఎక్స్ వేదికగా కీలక ప్రకటన చేసింది. పశ్చిమాసియాలో తలెత్తిన యుద్ధకారాణాలతో ఇరాన్, ఇరాక్ గగనతలం అందుబాటులో లేదని, పలు విమానాల రాకపోకలు ఆలస్యంగా నడునున్నాయని పేర్కొంది. అంతేకాకుండా నిర్ణయించిన షెడ్యూల్ లో మార్పులు చేర్పులు జరిగాయని ఆ సంస్థ ప్రయాణీకులకు సూచించింది. అదేవిధంగా ఆదేశాల గగనతలం నుంచి కాకుండా ప్రత్యామన్నాయ మార్గాల్లో విమానాల రాకపోకలు సాగించనున్నాయని, ప్రయాణీకులు ఎప్పటికప్పుడు ఇండిగో వెబ్‌సైట్ ద్వారా తమ సర్వీసు వివరాలను ప్రయాణీకులకు అందుబాటులో ఉంచామని ఇండిగో సంస్థ ప్రకటనలో వెల్లడించింది.

# నేడు ఎస్వీ కళాశాల పూర్వ విద్యార్థి, ప్రముఖ సంఘ సేవకులు గుండా రమేష్

**-60వ పుట్టినరోజు...**
**అండమాన్ లో 26 ఏళ్ల ప్రస్థానం ....**
**-స్థిరాస్థి రంగంలో రారాజు...**
**సేవా కార్యక్రమాల్లో దిట్ట ...**



**హైదరాబాద్, జూన్ 14(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
గత 26 సంవత్సరాలుగా ఊరు గాని ఊరు అయిన అండమాన్ దీవుల్లో స్థిరపడి ఎన్నో స్వచ్ఛంద సేవా కార్యక్రమాల్లో కూడా పాల్గొంటూ సూర్యాపేటకు ఎనలేని పేరు ప్రఖ్యాతలు తీసుకొచ్చిన ఘనత మన ఎస్వీ కళాశాల పూర్వ విద్యార్థిదే అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇక వివరాల్లోకి వెళితే సూర్యాపేట కళాశాల పూర్వ విద్యార్థి గుండా రమేష్ అనుకోని సంఘటనతో తను డైరెక్టర్ గా పనిచేస్తున్న స్థిరాస్తి కంపెనీ సూచన మేరకు వృత్తిరీత్యా1998లో అండమాన్ దీవులకు వెళ్లాల్సి వచ్చింది. ఆరు నెలల కోసం అక్కడే ఉండాల్సి రావడంతో అప్పటినుంచి ఇప్పటివరకు దాదాపు 26 సంవత్సరాలు అక్కడే స్థిరపడి రియల్ ఎస్టేట్ రంగంలో మంచి పేరు పేరు ప్రఖ్యాతులు సంపాదించి, నీతికి నిజాయితీగా స్థిరాస్థి రంగంలో దూసుకుపోతున్నారు. 2002 లో హ్యాపీ నివాస్ పేరిట రియల్ ఎస్టేట్స్ కంపెనీ నీ స్థాపించి స్వంతంగా వ్యాపారం మొదలు పెట్టారు. 2003 లో అండమాన్ రాజధాని పోర్ట్ బ్లేర్ లోనీ జంగ్లీ ఘాట్ లో తనకు తండ్రి గుండా రాములు పేరిట జి ఆర్ రియల్ ఎస్టేట్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపనీ ని రిజిస్ట్రేషన్ చేయించారు. అండమాన్ నికోబర్ దీవుల్లోనే జిఆర్ రియల్ ఎస్టేట్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ మొట్టమొదటి రిజిస్ట్రేషన్ కంపెనీ కావడం విశేషం.ఆ ఘనత మన మన తెలుగు వారికే దక్కుతుంది. అప్పటినుంచి ఇప్పటివరకు 11 వెంచర్లు విజయవంతంగా పూర్తి చేసి, నాణ్యమైన వ్యాపారం తో వందలాది కస్టమర్ల అభిమానాన్ని చూరగొన్నారు. ఎన్నో సముద్రపు అలల మధ్య ఉండే అండమాన్ లో భూకంపం తాకిళ్ళు ఎదుర్కొంటూ గుండా రమేష్ నివాసం ఉండే సమీపానికి 2004 డిసెంబర్ 26 న రిక్టర్ స్కేల్ పై 9.4 పాయింట్ల తో సునామీ వచ్చి వందలాది మంది మృతి చెందినప్పటికీ, గుండా రమేష్ భయపడకుండా ధైర్యంగా ఎదుర్కొని, తిరిగి వ్యాపార రంగంలో నిలదొక్కుకున్నారు. ఆయన సేవలను గుర్తించి ఎన్నో స్వచ్ఛంద సేవ సంస్థలు దేవాలయాలు కమిటీలు సత్కరించి గౌరవించాయి. అంతేకాకుండా కోవిడ్ పీరియడ్ లోను యావత్ ప్రపంచం స్తంభించి రాకపోకలు బంద్ అయినప్పుడు కూడా కొన్ని నెలల పాటు అండమాన్ రాజధాని పోర్టు బ్లేర్ లోని తన కార్యాలయములో నే నివాసము ఉంటూ కోవిడ్ ను కూడా ధైర్యంగా ఎదుర్కొన్నారు. వ్యాపార రీత్యా ఎంత బిజీగా ఉన్నప్పటికీ కుటుంబం పట్ల శ్రద్ధ వహిస్తూ, అటు తను పుట్టిన ఊరు సూర్యాపేట కు వస్తూ, హైదరాబాద్ - వైజాగ్ తదితర ప్రాంతాలలో కూడా నిరంతర పర్యటనలు కొనసాగించి వ్యాపార రంగంలో రాణించి నిలదొక్కుకోవడం అంటే ఆషామాషీ కాదు. అంత బిజీ షెడ్యూల్ లోను హైదరాబాదులో ఏ శుభకార్యం జరిగిన వచ్చి సమయం ఇవ్వటం గూండా రమేష్ కే చెల్లుతుంది. హైదరాబాద్ హ సూర్యాపేట ప్రాంతాలలో ఉన్నటువంటి ఎస్వీ కళాశాల పూర్వ విద్యార్థులు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో సన్నిహితంగా ఉంటూ ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంటూ యోగ క్షేమములను తెలుసుకుంటూ అండమాన్ లో ఉన్నప్పటికీ హైదరాబాదులోనే ఉన్నట్టుగా అందరికీ అందుబాటులో ఉంటున్నారు. ఈ సందర్భంగా గుండా రమేష్ మాట్లాడుతూ నేను ఇన్ని సంవత్సరాలు పాటు అండమాన్ లో వ్యాపారాన్ని విజయవంతంగా కొనసాగిస్తూ, సమాజ సేవలో పాల్గొనీ తనకు ఇంత పేరు ప్రఖ్యాతలు రావడానికి తన భార్య శ్రీమతి రాజేశ్వరి సహకారం మరువలేనిదని అన్నారు. అదేవిధంగా తన కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు తను చదువుకున్న ఎస్ వి డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థుల సహకారం మరవలేనిదని అన్నారు. అంతేకాకుండా తాను అండమాన్ రాజధాని పోర్టు బ్లేర్ లో వ్యాపార రంగంలో కాలు పెట్టినప్పటి నుంచి నాతో పాటు ఉంటున్న సిబ్బంది సహకారంతోనే ఇన్ని సంవత్సరాల పాటు స్థిరాస్తి రంగంలో నిలదొక్కుకున్నానని గుండా రమేష్ వివరించారు. ఏది ఏమైనాప్పటికీ ఈరోజు 15.06.2025 న గుండా రమేష్ 60వ వసంతంలోకి అడుగుపెట్టడం ఆనందదాయకం. గుండా రమేష్ జన్మదిన పురస్కరించుకొని ఎస్వీ కళాశాల పూర్వ విద్యార్థులందరూ, అభిమానులు శ్రేయోభిలాషులు, కుటుంబ సభ్యులందరూ గుండా రమేష్ కు జన్మదిన పెద్ద ఎత్తున శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

# హైదరాబాద్ తరహా హైడ్రా చర్యలు మానకొండూర్‌లో ప్రారంభం

**-"ఎమ్మెల్యే ఆన్ వీల్స్"తో అక్రమ భూకబ్జాలకు గట్టి హెచ్చరిక**
**-కొత్తపల్లిలో రోడ్డు ఆక్రమణ తొలగింపు ు**
**అధికారుల ముందు వెనక్కి తగ్గిన భూ కబ్జాదారులు**


**మానకొండూర్, జూన్ 14(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
హైదరాబాద్‌లో చట్ట వ్యతిరేక భూకబ్జాలపై చేపడుతున్న హైడ్రా చర్యలు ఇప్పుడు మానకొండూర్ నియోజకవర్గంలోనూ ప్రారంభమయ్యాయి. అక్రమార్కులకు దడపుట్టించేలా, ప్రజల సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపేలా మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ "ఎమ్మెల్యే ఆన్ వీల్స్" కార్యక్రమంతో సామాజిక బాధ్యతను చాటుతున్నారు. తాజాగా తిమ్మాపూర్ మండలంలోని కొత్తపల్లి గ్రామంలో ప్రభుత్వ భూమిలోని రోడ్లను ఆక్రమించిన ఘటనపై గ్రామస్థులు ఫిర్యాదు చేయగా, ఎమ్మెల్యే డాక్టర్ సత్యనారాయణ వెంటనే స్పందించి, జిల్లా కలెక్టర్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లారు. స్పందనలో భాగంగా రెవెన్యూ శాఖ, గ్రామాభివృద్ధి శాఖ, పోలీస్ శాఖలు సంయుక్తంగా సర్వే నిర్వహించాయి. అక్రమ నిర్మాణం నిర్ధారణయ్యే సరికి, సంబంధిత ప్రాంతంలో నోటీసులు జారీచేసి,



అభ్యంతరాల గడువు ముగిసిన వెంటనే అధికారుల సమక్షంలో రోడ్డును తొలగించారు. పాత నక్సాలో ఉన్న పక్కా రహదారిని తిరిగి స్వాధీనం చేసుకున్నారు. ఈ చర్యల సందర్భంగా కొంతకాలంగా రాజకీయంగా ప్రభావవంతంగా వ్యవహరిస్తున్న ఓ మాజీ ప్రజాప్రతినిధి స్వల్పంగా ప్రతిఘటించినా, చట్టం ముందు ఎవరూ పైచేయిగా ఉండలేరని అధికారులు గట్టి హెచ్చరికలు జారీ చేశారు. అధికారుల ఖచ్చితమైన వైఖరికి విస్మయ చెందిన గ్రామస్థులు, "ఇలాంటిదే కావాలి" అంటూ తాము ఎదుర్కొంటున్న సమస్యలపై స్పందనకు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి మాట్లాడుతూ, రియల్ ఎస్టేట్ పేరిట గ్రామాల అభివృద్ధిని అడ్డుకునే విధంగా జరిగే అక్రమ నిర్మాణాలను ప్రభుత్వం తీవ్రంగా తీసుకుంటోందని స్పష్టం చేశారు. ప్రజల సొమ్ము మీదే పాలన సాగిస్తున్నామని, వారి హక్కులను కాపాడటమే ప్రభుత్వ బాధ్యత అని చెప్పారు. ఇలాంటి చర్యలు ఇప్పుడే మొదలైయ్యాయని, భవిష్యత్తులో మరిన్ని చర్యలు తీసుకుంటామని, ప్రజల సహకారం ఉంటే ఒక్క అక్రమానికి కూడా చోటు ఉండదని హెచ్చరించారు. ఇటీవల స్వాధీనం చేసుకున్న రహదారిపై త్వరలో సీసీ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధంగా ఉన్నాయని, దాన్ని తక్షణమే ఆమోదించి పనులు ప్రారంభిస్తామని వెల్లడించారు. ఇకపై మానకొండూర్ నియోజకవర్గంలో ఎక్కడైనా ప్రభుత్వ భూములపై ఆక్రమణలుంటే, ప్రజలు తక్షణమే తన దృష్టికి తీసుకురావాలని కోరారు.

# భారత్‌లో 7,400కి పెరిగిన కరోనా యాక్టివ్ కేసులు..

**న్యూఢిల్లీ- జూన్ 14(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
భారత్‌లో కరోనా వైరస్ వ్యాప్తి కొనసాగుతోంది. నిత్యం వందలాది కేసులు వెలుగు చూస్తున్నాయి. గత 24 గంటల్లో 200కి పైగా కొత్త కేసులు నమోదయ్యాయి కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ డేటా ప్రకారం.. శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి శనివారం ఉదయం 8 గంటల వరకూ దేశంలో 269 కొత్త కేసులు బయటపడ్డాయి. అత్యధికంగా కర్ణాటకలో 132 కేసులు వెలుగు చూశాయి. దీంతో దేశంలో యాక్టివ్ కేసుల సంఖ్య 7,400కి పెరిగింది. అత్యధికంగా కేరళ రాష్ట్రంలో 2,109 కేసులు యాక్టివ్‌గా ఉన్నాయి. ఆ తర్వాత గుజరాత్‌లో 1,437, పశ్చిమ బెంగాల్‌లో 747, ఢిల్లీలో 672, మహారాష్ట్రలో 613, కర్ణాటకలో 527 కేసులు యాక్టివ్‌గా ఉన్నాయి.



ఇక నిన్న ఒక్కరోజే తొమ్మిది మరణాలు సంభవించాయి. మహారాష్ట్రలో నలుగురు, కేరళలో ముగ్గురు, రాజస్థాన్, తమిళనాడు రాష్ట్రాల్లో ఒక్కొక్కరు చొప్పున మొత్తం తొమ్మిది మంది మరణించారు. దీంతో ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకూ కరోనాతో మరణించిన వారి సంఖ్య 87కు పెరిగింది. ఇక కరోనా వైరస్ నుంచి కోలుకున్న వారి సంఖ్య 11 వేలు దాటింది. ఇప్పటి వరకూ 11,967 మంది వైరస్ నుంచి కోలుకున్నారు.

# ధర్మపురిని అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దుతా

-పెండింగ్ పనులన్నీ త్వరితగతిన పూర్తి చేయండి
-అధికారులకు మంత్రి లక్ష్మణ్ కుమార్ ఆదేశం



**ధర్మపురి, జూన్ 14(నీలగిరి ఎక్స్‌ప్రెస్)** ధర్మపురి నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా అధికారులు కృషి చేయాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధికారులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. మండలంలో పెండింగ్‌లో ఉన్న అన్ని అభివృద్ధి పనులను వెంటనే పూర్తిచేయాలని ఆదేశించారు. ముఖ్యంగా సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంపై అధిక ప్రాధాన్యత కలిగిన చర్యలు తీసుకోవాలని, తాగునీటి సమస్యలు తలెత్తకుండా సకాలంలో ప్రణాళికలు అమలు చేయాలన్నారు. శనివారం ధర్మపురి శ్రీలక్ష్మీనరసింహస్వామి గార్డెన్‌లో నిర్వహించిన అభివృద్ధి పనుల సమీక్ష సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సమీక్షలో జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్, అదనపు కలెక్టర్ బీఎస్.లతా, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాగునీరు, తాగునీరు, విద్యా, వైద్యం, రోడ్లు-భవనాలు, పంచాయతీరాజ్, వ్యవసాయం, సివిల్ సప్లైస్, విద్యుత్, సంక్షేమ హాస్టళ్ల పనితీరు తదితర విభాగాల్లో పురోగతిపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గానికి చెందిన పెండింగ్ పనులు ఎందుకు ఆలస్యమవుతున్నాయో తేల్చాల్సిన అవసరం ఉందని, వాటికి వెంటనే పరిష్కారం కనుగొని పనులను పూర్తి చేయాలని మంత్రి అధికారులకు సూచించారు. ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన నిధుల మంజూరుకు తానే స్వయంగా కృషి చేస్తానని తెలిపారు. రోళ్ళ వాగు ప్రాజెక్టు నిర్మాణానికి అటవీ శాఖ అనుమతులు రావాల్సిన అవసరం ఉందని, ఈ విషయంలో తాను ఢిల్లీకి వెళ్లి కేంద్ర అధికారులతో చర్చిస్తానన్నారు. తాగునీటి సమస్యలు తలెత్తకుండా, సాగునీటి అవసరాలు తీరేలా వ్యవస్థాబద్ధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వానాకాలం సీజన్‌కు ముందే తాత్కాలిక రహదారుల నిర్మాణం చేపట్టాలని, పల్లెల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే, రైతులకు విత్తనాలు, ఎరువులు, యూరియా లభ్యమయ్యేలా వ్యవసాయ శాఖ సమయానుకూలంగా వ్యవహరించాలని ఆదేశించారు. సంక్షేమ హాస్టళ్లలో నాణ్యమైన బియ్యం పంపిణీ జరిగేలా, విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన జరిగేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. మరుగుదొడ్లు లేని పాఠశాలల్లో వెంటనే నిర్మాణం చేపట్టాలని అధికారులకు సూచించారు. ఏ శాఖలో అయినా సమస్యలు తలెత్తినచో వెంటనే తన దృష్టికి, కలెక్టర్ దృష్టికి తీసుకురావాలని అన్నారు. ధర్మపురిలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయడంలో యావత్తు అధికార యంత్రాంగం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని మంత్రి హితవు పలికారు. ప్రజా సమస్యల పరిష్కారానికి టాప్ ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ముందస్తు ప్రణాళికలతో గ్రామీణ ప్రాంతాల్లో సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో అచూకీ ఉండాలన్నారు. సమీక్ష అనంతరం మంత్రి లక్ష్మణ్ కుమార్, కలెక్టర్ సత్యప్రసాద్‌తో కలిసి పలువురు లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ%"ా% "ఇల్లు అనేది ప్రతి పేదవాడి కల. ఆ కలను నిజం చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోంది. మంజూరు పొందిన లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసుకోవాలి. ప్రభుత్వం ఉచితంగా ఇసుకను సరఫరా చేస్తోంది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి" అని సూచించారు. ఈ సమావేశంలో ఆర్డీవో మధుసూదన్, ఇరిగేషన్ సీఈ సుధాకర్ రెడ్డి, పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# జూన్ 19న శుభాన్షు శుక్లా అంతరిక్ష యాత్ర.

-ప్రకటించిన ఇస్రో



**న్యూఢిల్లీజూన్ 14(నీలగిరి ఎక్స్‌ప్రెస్)** సాంకేతిక సమస్యతో వాయిదా పడిన స్పేస్ ఎక్స్ డ్రాగన్ వ్యోమనౌక ప్రయోగానికి సంబంధించి కొత్త తేదీని ఇస్రో తాజాగా ప్రకటించింది. ఈనెల 19న ఈ ప్రయోగం చేపట్టనున్నట్లు వెల్లడించింది. అమెరికాలోని ఫ్లోరిడాలో ఉన్న నాసాకు చెందిన కెన్నెడీ స్పేస్ సెంటర్ నుంచి ఈ ప్రయోగం జరగనుంది. ఈ ప్రయోగం ద్వారా భారత్, పోలండ్, హంగేరీకి చెందిన నలుగురు వ్యోమగాములను అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి పంపుతున్నారు. ఈ మిషన్‌కు భారత వ్యోమగామి శు భాన్షు శుక్లా పైలట్‌గా వ్యవహరించబోతున్నారు. అమెరికా ప్రైవేట్ స్పేస్ సంస్థ 'యాక్సియమ్' చేపడుతున్న మానవ సహిత అంతరిక్ష ప్రయోగం 'ఏఎక్స్-4' మిషన్ లో భాగంగా స్పేస్‌ఎక్స్ ఫాల్కన్ 9 రాకెట్ ద్వారా వీరు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్లనున్నారు. దీంతో ప్రైవేట్ రోదసి యాత్ర ద్వారా ఐఎస్ఎస్‌కు వెళ్లిన తొలి భారత వ్యోమగామిగా శుభాన్షు చరిత్రకెక్కనున్నారు. ఇప్పటికే భారత్‌కు చెందిన ప్రముఖ వ్యోమగామి రాకేశ్ శర్మ రోదసి యాత్ర చేపట్టిన విషయం తెలిసిందే. రష్యా సహకారంతో అంతరిక్షయానం చేశారు. రాకేశ్ శర్మ రోదసి యాత్ర చేసిన నాలుగు దశాబ్దాల (1984) తర్వాత శుభాన్షు ఈ గౌరవాన్ని దక్కించుకోనున్నారు. నాసా సహకారంతో శుక్లా ఐఎస్ఎస్‌లో వివిధ శాస్త్రీయ పరిశోధనలు చేయనున్నారు. పైలట్‌గా ఈ యాత్రలో పాల్గొనేందుకు ఎంతో ఆసక్తితో ఎదురు చూస్తున్నానని శుక్లా ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. నిజానికి మే 29నే ఈ ప్రయోగం జరగాల్సి ఉండగా వాయిదా పడింది. తొలుత ఈ ప్రయోగాన్ని జూన్ 8వ తేదీకి వాయిదా వేశారు. ఆ తర్వాత జూన్ 10, జూన్ 11కు వాయిదా పడింది. యాక్సియం-4 మిషన్‌కు సంబంధించిన ఫాల్కన్-9 రాకెట్ తనిఖీల్లో ద్రవరూప ఆక్సిజన్ లీకేజ్ కారణంగా జూన్ 11న జరగాల్సిన ఈ ప్రయోగం మళ్లీ వాయిదా వేశారు. లీకేజ్‌కు సంబంధించిన మరమ్మత్తులు పూర్తిచేసేందుకు మరింత సమయం పడుతుందని, రాకెట్ లాంచింగ్‌ను వాయిదా వేస్తున్నట్లు స్పేస్‌ఎక్స్ తెలిపింది. ఈ క్రమంలో ఇప్పుడు కొత్త తేదీని ప్రకటించింది.

# ఆ నిర్ణయం సిగ్గుచేటు: ప్రియాంక గాంధీ



**హైదరాబాద్ జూన్ 14(నీలగిరి ఎక్స్‌ప్రెస్)** గాజా-ఇజ్రాయిల్ మధ్య కాల్పుల విరమణ జరగాలని ఐక్యరాజ్యసమితి ఓటింగ్ నిర్వహించింది. ఈ ఓటింగ్‌కు భారత్ హాజరకాలేదు. ఈక్రమంలో భారత్ ప్రభుత్వ నిర్ణయంపై కాంగ్రెస్ అగ్రనాయకురాలు ప్రియాంక గాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు. గాజాలో ఇజ్రాయిల్ మారణోమం సృష్టిస్తుందని వాపోయారు. మారణకాండను కట్టడి చేయడానికి అంతర్జాతీయ సంస్థ ముందడకు వేస్తే.. కేంద్ర ప్రభుత్వం అర్థంలేని నిర్ణయం తీసుకుందని, ఇది సిగ్గుచేటు అని ఆమె శనివారం సోషల్ మీడియా ఎక్స్ వేదికగా మండిపడ్డారు. బెంజమిన్ నెతన్యాహు ఒక దేశాన్ని మొత్తం నాశనం చేస్తుండగా భారతదేశం నిశ్శబ్దంగా నిలబడటమే కాకుండా ఇరాన్‌పై దాడి చేసి, దాని సార్వభౌమత్వాన్ని బహిరంగంగా ఉల్లంఘిస్తుందని, అన్ని అంతర్జాతీయ నిబంధనలను ఇరాన్ పూర్తిగా బేఖాతరు చేస్తుందని ఆమె ఆరోపించారు. గాజాలో ఎక్కువ మొత్తంలో మహిళలు, చిన్నారులు చంపబడుతున్నారని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. నిజమైన ప్రపంచ నాయకత్వం న్యాయాన్ని కాపాడుకోవడానికి ధైర్యాన్ని కోరుతుందని, మనం మానవత్వం కోసం తమ గొంతును తిరిగి పొందాలి, సత్యం అహింస కోసం నిర్భయంగా నిలబడాలని ఆమె పిలుపునిచ్చారు. ఇజ్రాయిల్-హమాస్ మధ్య జరుగుతున్న యుద్ధం విరమించాలని కోరుతూ ఐక్యరాజ్య సమితి (ఐరాస) సర్వసభ్య సమావేశంలో ఓటింగ్ జరిగింది. దీనికి భారత్ గైర్హాజరు అయింది. ఈ ఓటింగ్‌లో 149 దేశాలు ప్రతిపాదనకు అనుకూలంగా ఓటు వేశాయి. అమెరికా, ఇజ్రాయిల్ తో పాటు 10 దేశాలు వ్యతిరేకించాయి.భారత్ సహా మరో 19 దేశాలు ఓటింగ్‌లో పాల్గొనలేదు. దక్షిణాసియా,బ్రిక్స్, ఎస్‌సీఓ దేశాల్లో భారత్ ఒక్కటే ఓటింగ్ కి దూరంగా ఉంది. గత డిసెంబర్ 2024లో ఇటువంటి ప్రతిపాదనకు అనుకూలంగా ఓటు వేసిన భారత్, ఆరు నెలల తర్వాత తన నిర్ణయాన్ని మార్చుకోవడం గమనార్హం.

# లండన్ టికెట్‌ను రెండుసార్లు రద్దు చేసుకున్న విజయ్ రూపానీ






**అహ్మదాబాద్ -జూన్ 14(నీలగిరి ఎక్స్‌ప్రెస్)** ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంలో మరణించిన గుజరాత్ మాజీ సీఎం విజయ్ రూపానీ ఈ ప్రయాణానికి ముందు రెండుసార్లు లండన్ టికెట్‌ను రద్దు చేసుకున్నారు. లండన్‌లో ఉన్న భార్య, కుమార్తెను కలిసేందుకు తొలుత మే 19న ఎయిర్ ఇండియా విమానంలో టికెట్ బుక్ చేసుకున్నారు. జూన్ 25న భారత్‌కు తిరిగి రావాలని భావించారు. అయితే ఆ ప్లాన్‌లో మార్పు వల్ల మే 19న లండన్ వెళ్లాల్సిన విమాన టికెట్‌ను రద్దు చేసుకున్నారు. జూన్ 5న ప్రయాణించాలని నిర్ణయించి ఆ తేదీకి విమాన టికెట్ బుక్ చేసుకున్నారు.కాగా, విజయ్ రూపానీ మళ్లీ తన ట్రావెల్ ప్లాన్ మార్చుకున్నారు. జూన్ 5న బుక్ చేసిన విమాన టికెట్‌ను రెండోసారి రద్దు చేసుకున్నారు. జూన్ 12న ప్రయాణించేందుకు ఎయిర్ ఇండియా విమానం ఏఐ 171లోని సీటు నంబర్ 2డీని బుక్ చేసుకున్నారు. అయితే గురువారం అహ్మదాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి టేకాఫ్ అయిన ఒక నిమిషంలోపే ఆ విమానం ఎత్తు కోల్పోయింది. మెడికల్ కాలేజీ హాస్టల్ బిల్డింగ్‌పై కూలి పేలిపోయింది. మరోవైపు ఈ ప్రమాదంలో విజయ్ రూపానీతో సహా ఆ విమానంలోని 229 మంది ప్రయాణికులు, 12 మంది సిబ్బందితోపాటు 33 మంది ఇతర వ్యక్తులతో సహా మొత్తం 274 మంది మరణించారు. అదృష్టవశాత్తు బ్రిటన్ పౌరుడైన రమేష్ విశ్వాస్ అనే ఒక్క ప్రయాణికుడు మాత్రమే ప్రాణాలతో బయటపడ్డాడు.


# ఢిల్లీలో భారీ అగ్నిప్రమాదం..

-సీసీఎస్ భవన్‌లో మంటలు



**న్యూఢిల్లీజూన్ 14(నీలగిరి ఎక్స్‌ప్రెస్)** దేశ రాజధాని ఢిల్లీ లో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. జన్‌పథ్ రోడ్డు లో ఉన్న సీసీఎస్ భవనంలో శనివారం ఉదయం మంటలు చెలరేగాయి. ప్రమాద సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుంది. దాదాపు 13 ఫైరింజన్లతో మంటలను అదుపుచేసేందుకు ప్రయత్నిస్తోంది.'జన్‌పథ్ రోడ్డులోని సీసీఎస్ భవనంలో అగ్నిప్రమాదం సభవించింది. 13 ఫైరింజన్లు ప్రమాద స్థలికి చేరుకున్నాయి. మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నిస్తున్నాం' అని అగ్నిమాపక శాక అధికారులు తెలిపారు. అయితే, ఈ ప్రమాదంలో ప్రాణ, ఆస్తి నష్టానికి సంబంధించి ఎలాంటి సమాచారం రాలేదు. కాగా, ఇటీవలే ఢిల్లీలో వరుస అగ్నిప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయి. నివాస, వ్యాపార సముదాయాల్లో ఎక్కడో ఒకచోట మంటలు వ్యాపిస్తున్నాయి. ఇటీవలే ద్వారకా ప్రాంతంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో తండ్రి, ఇద్దరు పిల్లలు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే.

# డీఎన్ఏ మ్యాచ్ తర్వాత.. తొలి మృతదేహాన్ని కుటుంబానికి అప్పగింత



**అహ్మదాబాద్ -జూన్ 14(నీలగిరి ఎక్స్‌ప్రెస్)** గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో గురువారం జరిగిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంలో మరణించిన వారిని డీఎన్ఏ పరీక్ష ద్వారా గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు. డీఎన్ఏ మ్యాచింగ్ తర్వాత నిర్ధారించిన తొలి మృతదేహాన్ని బాధిత కుటుంబానికి శనివారం అప్పగించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రి వద్ద విషాద వాతావరణం నెలకొన్నది. దుఃఖిస్తున్న బంధువులు మృతదేహాన్ని అందుకున్నారు. గుజరాత్ మంత్రి జగదీష్ విశ్వకర్మ ఈ సందర్భంగా అక్కడ ఉన్నారు. అధికారిక ఎస్కార్ట్‌తో మృతదేహాన్ని కుటుంబానికి అప్పగించారు.కాగా, విమాన ప్రమాదంలో ప్రయాణికులు, సిబ్బంది, ఇతర వ్యక్తులతో సహా 270 మందికిపైగా మరణించారు. విమానంలో మంటల వల్ల చాలా మంది సజీవదహనమయ్యారు. ఈ నేపథ్యంలో డీఎన్ఏ పరీక్షల ద్వారా మృతులందరినీ గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు. మరోవైపు హోం శాఖ సహాయ మంత్రి హర్ష్ సంఘవి ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. డీఎన్ఏ పరీక్షల ప్రక్రియను సమీక్షించారు. ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ (ఎఫ్ఎస్ఎల్), హోం శాఖ, ఇంటెలిజెన్స్ బ్యూరో అధికారులు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. బాధితులను గుర్తించి, మృతదేహాలను వీలైనంత త్వరగా వారి కుటుంబాలకు అప్పగించడానికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని హర్ష్ సంఘవి తెలిపారు.